
జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php




సంపుటి 15 సంచిక 183 విశాఖపట్నం | శనివారం 04 మార్చి 2023 | 8 పేజీలు | వెల : 5.00

# రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు

## విశాఖే పరిపాలనా రాజధాని

## గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో జగన్



విశాఖ :ప్రజాపాలన ప్రతినిధి: విశాఖ వేదికగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ పచ్చదనం, డీకార్బనైజేషన్, పారిశ్రామిక రవాణా మౌలిక వసతులు, డిజిటలైజేషన్, ఆంట్రపెన్యూర్‌షిప్ ఈ నాలుగు రాష్ట్రానికి మూల స్తంభాల్లాంటివని అభివర్ణించారు. మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు ఉన్న ఏకైక రాష్ట్రమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పరిశ్రమల అవసరాల్ని తీర్చేలా అంతర్జాతీయ స్థాయిలో 26 నైపుణ్య కాలేజీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతే కాకుండా ఎపికి రూ. 13లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని గర్వంగా చెబుతు న్నాను. 340 సంస్థలు పెట్టుబడి పెట్టేందుకు వచ్చాయి. తొలిరోజు 92 ఎంవోయూలు రాగా మొత్తం 340 ఎంవోయూలు. దీని ద్వారా 6 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. 20 రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి.

**విశాఖే పరిపాలనా రాజధాని**

ఆంధ్రప్రదేశ్ పరిపాలనా రాజధాని విశాఖపట్నమేనని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ వేదికగా ఏపీ సీఎం వైఎస్ జగన్ మరోసారి స్పష్టం చేశారు. త్వరలో తాను కూడా విశాఖకే షిఫ్ట్ అవుతానని, ఇక్కడి నుంచే పాలన సాగిస్తామని వెల్లడించారు. రాష్ట్రం నుంచి ఎగుమతులు గణనీయంగా పెరిగాయని జగన్ చెప్పారు. ''ఏపీలో మూడు పారిశ్రామిక కారిడార్లు ఉన్నాయి. భౌగోళికంగా పరిశ్రమలకు ఏపీ అనుకూలం. రాష్ట్రంలో సులువైన పారిశ్రామిక విధానం ఉంది. క్రియాశీలక ప్రభుత్వం ఉంది. విశాఖ త్వరలోనే పరిపాలనా రాజధాని కాబోతోంది. నేను కూడా విశాఖ నుంచే పాలన చేయబోతున్నా. త్వరలోనే ఇది సాకారమవుతుంది'' అని వివరించారు. ఏపీ కీలక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చినట్లు జగన్ చెప్పారు. దేశ ప్రగతిలో రాష్ట్రం ఎంతో కీలకంగా మారిందని తెలిపారు. ఇక్కడ నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయని వివరించారు. ఏపీలో రూ. 13 లక్షల కోట్లతో పెట్టుబడులు పెట్టేందుకు 340 ఇన్వెస్ట్ మెంట్ ప్రతిపాదనలు వచ్చినట్లు సీఎం జగన్ వెల్లడించారు.


## మీడియా రంగంలో విప్లవాత్మక మార్పులకు

# శ్రీకారం చుట్టిన మాస్టర్ కీ ఛానల్...



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ): ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో ఉన్న టీవీ ఛానళ్లు,పత్రికలు అన్నీ.. మూడు పొలిటికల్ పార్టీలకు.. మూడు కులాలకు అనుకూలమైన వార్తలను మాత్రమే ప్రసారం చేస్తున్నాయన్నారు స్నేహ సంస్థల చైర్మన్, మాస్టర్ కీ ఛానల్ ఎం డి డాక్టర్ కటికల శివ భాగ్యారావు. ప్రతీ రాజకీయపార్టీకి అనుబంధంగా ఒక ఛానల్ ను పనిచేస్తుందని ఈ ఛానల్ లలో బహుజనుల సమస్యలు ప్రసారం కావడం లేదన్నారు. పార్టీ ల కరపత్రాలుగా పత్రికలు, ఆయా పార్టీ ల కార్యక్రమాలు తప్ప వేరే వార్తలు ఛానల్ లు ప్రసారం చేయడం లేదని తెలిపారు. మాస్టర్ కీ ఛానల్ లో ప్రతీ ప్రతి ఒక్కరిని భాగస్వాములుగా చేయడమే కాకుండా, వారి నియోజకవర్గాలలో వారి సమస్యల పరిష్కారం కోసం మాస్టర్ కీ కృషి చేస్తుందన్నారు. ఈ దేశం బాగుండాలని కోరుకునే ప్రతి ఒక్కరి మనోభావాలను, సమస్యల పరిష్కారం కోసం మీడియా ద్వారా,ఎంపవర్మెంట్ చేస్తున్నామన్నారు. ప్రతి పౌరుడికి మీడియా ద్వారా సాధికారిత కల్పించాలన్నదే మాస్టర్ కీ ఛానల్ ధ్యేయం అన్నారు. ఈ సాధికారత వల్ల ప్రజలు తమ సమస్యల పట్ల చైతన్యం కలిగి సామాజికంగారక్షించుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయాలన్న లక్ష్యం తోనే మాస్టర్ కీ ఛానల్ ఏర్పాటు చేశామని,'ప్రస్తుతం కేబుల్ టీవీ ఛానెల్ గా ఉన్న మాస్టర్ కీ టీవీప్రతి ఒక్కరినీ భాగస్వామ్యులుగా చేస్తూ త్వరలోనే శాటిలైట్ ఛానల్ గా రూపాంతరం చెందబోతున్నట్లు ఆయన తెలిపారు. బహుజనుల బాగుకోరే ఏకైక ఛానల్ మాస్టర్ కీ ఛానల్ ఇందులో అందరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

## భారత్‌తో మెరుగైన సంబంధం కలిగి ఉన్నాం : ఇటలీ ప్రధాని



న్యూఢిల్లీ : ప్రజాపాలన ప్రతినిధి: ఇటలీ మరియు భారత్‌లు గతం కన్నా మెరుగైన సంబంధాలను కలిగి ఉన్నాయని ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ పేర్కొన్నారు. గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన బహుపాక్షిక సమావేశాలు 'రైసినా డైలాగ్' కు ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇరు దేశాల భౌగోళిక స్వరూపాలు ఒకేవిధంగా ఉన్నాయని అన్నారు. తూర్పు మధ్యధరా, ఆఫ్రికా, యూరప్‌లను కలిపే వారధిగా ఇటలీ వ్యవహరిస్తోందని అన్నారు. ఉత్పత్తి దేశాలు తమ వనరుల ద్వారా పూర్తి ప్రయోజనం పొందాలని అన్నారు. ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన మొదట్లో ఇంధనం వంటి సాధారణ ప్రాధాన్యతలపై సమాన భాగస్వామ్యాలను అభివృద్ధి చేయడానికి ప్రాధాన్యత నిచ్చానని, అయితే ఉత్పత్తి దేశాలు స్థిరత్వం కోసం, శ్రేయస్సు కోసం ఆయా దేశాల వనరుల నుండి తప్పక ప్రయోజనం పొందితీరాలని స్పష్టం చేశారు. విద్యుత్తు, గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్‌లను తమ దేశ ప్రజల కోసం, ఐరోపా కోసం మరింత ఎక్కువగా ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. జి20లో భారత్ నాయకత్వం, రైసినా చర్చలు కలిసి ప్రపంచానికి సహకారం, శాంతి సందేశాన్ని పంపగలవని అన్నారు. వాతావరణ మార్పులపై ప్రపంచ సమన్వయం జీరో-సమ్ గేమ్ కాకూడదని, ఈ విషయంలో భారత్ నేతృత్వంలోని ఇండో-పసిఫిక్ దేశాలు బలమైన పాత్ర పోషించాలని ఆమె పేర్కొన్నారు. ఇండో-పసిఫిక్‌లో భారతదేశం కీలక పాత్ర పోషిస్తుందని, మధ్యధరా సముద్రంలో ఇటలీ కీలక వాటాదారని మెలోని పేర్కొన్నారు. ఇండో-పసిఫిక్‌లో జరిగే సంఘటనలు యూరప్‌పై ప్రత్యక్ష పరిణామాలను కలిగిస్తాయని ఆమె అన్నారు.




## 14 నుంచి అసెంబ్లీ సమావేశాలు

అమరావతి: ప్రజాపాలన ప్రతినిధి: ఎపిలో ఈ నెల 14వ తేదీ నుంచి అసెంబ్లీ, శాసన మండలి సమావేశాల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు. మార్చి 14న ఉదయం 10 గంటల నుంచి ఉభయసభలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మరోవైపు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి సంబంధించి ఉభయ సభలనూ ఉద్దేశించి 10 గంటలకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు.

# ప్రజాస్వామ్యంపై పెనుదాడి

## కేంబ్రిడ్జి వర్సిటీలో మోదీ సర్కార్‌పై రాహుల్ ఫైర్



లండన్ ప్రజాపాలన ప్రతినిధి: : భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి జరుగుతోందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీలో శుక్రవారం ఉపన్యసించిన రాహుల్ మోదీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు అవసరమైన వ్యవస్థలు నిర్బంధానికి లోనవుతున్నాయని వ్యాఖ్యానించారు. తనపై నిఘా కోసం ప్రభుత్వం పెగాసస్ వాడుతోందని అన్నారు. 21వ శతాబ్ధంలో బోధనలు అనే అంశంపై వర్సిటీ విద్యార్థులను ఉద్దేశించి రాహుల్ మాట్లాడారు. భారత ప్రజాస్వామ్యంపై దాడిని నిలువరించేందుకు తాము ప్రయత్నిస్తున్నామని కాంగ్రెస్ ఎంపీ పేర్కొన్నారు. విపక్ష నేతలపై నిఘా కోసం ప్రభుత్వం పెగాసస్‌ను వినియోగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తన ఫోన్‌పైనా పెగాసస్‌తో నిఘా పెట్టారని వివరించారు. తనతో సహా విపక్ష నేతలపై ఫోన్లపై నిఘా పెట్టారని, తాను ఫోన్‌లో మాట్లాడేసమయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పుకొచ్చారు. మీడియా, న్యాయవ్యవస్థను ప్రభుత్వం తన గుప్పిట్లో ఉంచుకుందని మైనారిటీలు, దళితులు, గిరిజనులపై దాడులతో చెలరేగుతూ అసమ్మతిని అణిచివేస్తోందని దుయ్యబట్టారు. వారం రోజుల బ్రిటన్ పర్యటనలో భాగంగా రాహుల్ గాంధీ బిగ్ డేటా, ప్రజాస్వామ్యం, భారత్ -చైనా సంబంధాలపై జరిగే పలు సెషన్స్‌లో పాల్గొంటారు. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ బ్రిటన్ చాప్టర్ ప్రతినిధులతో సంప్రదింపులు జరపడంతో పాటు వారాంతంలో లండన్‌లో జరిగే భారత సంతతికి చెందిన వారితో సమావేశమవుతారు.

## మేఘాలయా సీఎం రాజీనామాకు గవర్నర్ ఆమోదం



షిల్లాంగ్: ప్రజాపాలన ప్రతినిధి: మేఘాలయా ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా రాజీనామాకు ఆ రాష్ట్ర గవర్నర్ ఫగు చౌహాన్ ఆమోదం తెలిపారు. అయితే, తదుపరి ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని సంగ్మాను గవర్నర్ కోరారు. కాగా, సంగ్మా నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 19 స్థానాల్లో విజయం సాధించింది. మెజారిటీకి మరో 12 స్థానాలు తక్కువ కావడంతో ఆ ఎన్నికల్లో 12 స్థానాలు గెలిచిన బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే తాజాగా 59 స్థానాలకు జరిగిన మేఘాలయా అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌పీపీ, బీజేపీ వేర్వేరుగా పోటీచేశాయి. ఎన్‌పీపీ మునుపటి కంటే 7 స్థానాలు ఎక్కువగా 26 స్థానాల్లో గెలుపొందింది. కానీ బీజేపీ మాత్రం గతంలో గెలిచిన 10 స్థానాలను పోగొట్టుకుని రెండు స్థానాలకు పరిమితమైంది. ఇప్పుడు ఎన్‌పీపీ, బీజేపీ కలిసినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మరో ఇద్దరి సభ్యుల మద్దతు కావాల్సి ఉంది. మేఘాలయా అసెంబ్లీలో మొత్తం 60 స్థానాలు ఉన్నాయి. అయితే, తీరా పోలింగ్‌కు కొన్ని రోజుల ముందు యూడీపీ అభ్యర్థి మరణించడంతో ఆ ఒక్కస్థానానికి ఎన్నిక జరగలేదు. కాబట్టి మొత్తం 59 స్థానాల్లో 30 మంది సభ్యుల బలం ఉన్న పార్టీ లేదా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని అవకాశం ఉంది.

## గంగా రామ్ హాస్పిటల్‌లో చేరిన సోనియా గాంధీ



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ మాజీ అధినేత సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. శ్వాస సంబంధిత వ్యాధితో ఆమె బాధపడుతున్నారు. దీంతో ఆమెను ఢిల్లీలోని గంగా రామ్ హాస్పిటల్‌లో చేర్పించారు. బ్రాంకైటీస్ వ్యాధికి సోనియా చికిత్స తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఆమె హాస్పిటల్‌లో చేరడం ఇది రెండవసారి. జనవరిలో కూడా శ్వాసకోశ వైరల్ ఇన్‌ఫెక్షన్‌తో ఆమె బాధపడ్డారు. కరోనా తీవ్రంగా ఉన్న సమయంలో కూడా పలుమార్లు ఆమె చికిత్స తీసుకున్న విషయం తెలిసిందే. జ్వరం వల్ల సోనియాను హాస్పిటల్‌లో చేర్పించినట్లు ట్రస్టు సొసైటీ చైర్మెన్ డీఎస్ రాణా తెలిపారు. చెస్ట్ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ అరూప్ బాసు నేతృత్వంలో చికిత్స సాగుతోందన్నారు. ఆమె కండీషన్ ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు.



## ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ గురుగు బెల్లి, దామోదర రావు



విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి: స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ గురుగు బెల్లి,దామోదర రావు, ప్రధాన కార్యదర్శి గా డాక్టర్. పారుపల్లి శ్రీనివాసరావు నునియమిస్తున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ శ్యాముల్ రెడ్డి, ప్రకటినచటం పట్ల సంఘ సేవకురాలు డాక్టర్ నీపాన. గుణవతి హర్షం వ్యక్తపరిచారు డాక్టర్ దామోదర్ రావు గతంలో బాలల హక్కుల కృషికి మెచ్చి డాక్టరేటను, శ్రీకాకుళం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను బహుకరించినట్లు అమె గురువారం నాడు విలేఖరులకు తెలిపారు. ఉత్తమ సేవా భావం గల గురుగుబెల్లికు ఈ పదవి లభించటం పట్ల డాక్టర్ గుణవతి హర్షం వ్యక్తపరచి, ఆయనను అభినందించారు. ఈ సంస్థ ద్వారా బాలల హక్కుల పరిరక్షణకు ఆయన మరింత కృషి చేయాలని ఆమె ఆశాభావం వ్యక్తపరిచారు.

## సిల్వర్ తో మెరిసిన సిక్కోలు ఆణిముత్యం

**అభినందించిన ఆదిత్య కళాశాలల యాజమాన్యం**



శ్రీకాకుళం ప్రజాపాలన ప్రతినిధి: :సెకండ్ ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్ షిప్ 2023 లో భాగంగా బోధిధర్మ సన్ లైన్స్ మార్షల్ ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురంలో మొన్న జరిగిన కటా పోటీలలో సిక్కోలు తెలుగు తేజం బంకి. అశ్విని 43 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ తో మెరిసి శ్రీకాకుళం జిల్లాకు ఘనకీర్తిని తెచ్చిపెట్టింది. బంకి. అశ్విని స్థానిక కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ రెండవ సంవత్సరం చదువుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ బరాటం శ్రీనివాస చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివ శంకర్ లు మాట్లాడుతూ అశ్విని ఇటు కాకినాడ ఆదిత్య కళాశాలకు, అటు శ్రీకాకుళం జిల్లాకు మంచి పేరు తేవటమే కాకుండా జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో వినపడేలా చేసిందని, అశ్విని సిక్కోలు ఆణిముత్యమని కొనియాడుతూ అశ్వినితో పాటు, శ్రీకాకుళం లో ఎన్నో ఏళ్లుగా కరాటే లో తర్ఫీదునిస్తూ ఎంతో మంది విద్యార్థులను తయారుచేసిన కోచ్ జానీ మాస్టర్ ను అభినందించి ముందు ముందు మరిన్ని పతకాలు సాధించి సిక్కోలు సత్తా చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి. వెంకట అప్పారావు, ఎన్.ఎస్.ఎస్ ఏపీవో ఎమ్. మౌనిక లు పాల్గొన్నారు.

## ఈనెల 13న ఏపీలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సెలవు



అమరావతి: ప్రజాపాలన ప్రతినిధి: ఏపీలో ఈనెల 13న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించింది. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా 13వ తేదీ సెలవుదినంగా ప్రకటిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్–సీఈవో) ముఖేష్ కుమార్ మీనా ఆదేశాలు జారీ చేశారు.. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు మినహా అన్ని జిల్లాల్లోని షాపులు, స్కూళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు..

## గుడివాడ ఎమ్మెల్యేపై అరెస్టు వారెంట్ జారీ..

విజయవాడ: ప్రజాపాలన ప్రతినిధి: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానిపై




అరెస్టు వారెంట్ అమలు చేయాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. కొడాలి నానిపై జారీ చేసిన అరెస్టు వారెంట్ ఈ ఏడాది జనవరి 5 నుంచి పెండింగ్‌లో ఉంది. వాయిదాలకు కొడాలి నాని రాకపోవడంపై విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన గవర్నర్?పేట సీఐ సురేష్ కుమార్?ని న్యాయమూర్తి ప్రశ్నించారు. నానిపై అరెస్టు వారెంట్ పెండింగ్?లో ఉందని, దాన్ని వెంటనే అమలు చేయాలని సీఐని జస్టిస్ గాయత్రీదేవి ఆదేశించింది. అప్పటి ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడానికి ప్రయత్నించడం లేదంటూ ఆందోళనలు చేశారు. పోలీసు ఉత్తర్వులు ఉల్లంఘించి 2016 మే 10న మాజీ మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే కొడాలి నాని, మరికొందరు నాయకులు ర్యాలీ చేపట్టారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారనే కారణంగా కేసు నమోదైంది. ఈ కేసులో కొడాలి నాని కోర్టుకు హాజరుకాక పోవడంతో న్యాయస్థానం అరెస్టు వారెంట్ జారీ చేసింది..

## షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలి: ఎపిటిఎఫ్ డిమాండ్



ప్రజాపాలన ప్రతినిధి: గుంటూరు:రాష్ట్ర అధ్యక్షులు శ్రీ హృదయరాజు,పూర్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కులశేఖర రెడ్డి గారికి ఇచ్చిన షోకాజ్ నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలనీ ఎపిటిఎఫ్ గుంటూరు జిల్లా డిమాండ్ చేస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రదాన కార్యదర్శి గోవిందు వెళాంగణిరాజు, మేకల సుబ్బారావు తెలిపారు. గుంటూరు నందలి అంబేద్కర్ కూడలి సెంటర్ నందలి అంబేద్కర్ గారికి వినతి పత్రం న ఎపిటిఎఫ్ ముఖ్యు నాయుకులు అందజేసారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్టెబోయిన నరసింహారావు మాట్లాడుతూ ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ హృదయరాజు,రాష్ట్ర పూర్వ ప్రదాన కార్యదర్శి శ్రీ కులశేఖర రెడ్డి,సోదర సంఘం నాయుకులు శ్రీ లక్ష్మయ్య,శ్రీ తిమ్మన్న, శ్రీ సాంబశివారెడ్డి తదితరులకు నోటీషులు విద్యాశాఖాధి కారులు ఇవ్వటం పట్ల ఎపిటిఎఫ్ నిరసన తెల్పునట్లు వారు తెలిపారు. జిల్లా ప్రదాన కార్యదర్శి మేకల సుబ్బారావు మాట్లాడుతూ. ప్రజాస్వామ్య వ్యవస్దలో ఎవరైన పోటీ చేసుకోవచ్చునీ,గెలుపు ఓటములు సహాజమనీ, ఉపాద్యాయుల మద్దతు ఎవరికైతే ఉంటుందో వారు గెలుపోందుతారని అన్నారు. ఉపాధ్యాయ సంపాదకుడు శ్రీ ఎ.వి రామారావు గారు మాట్లాడుతూ కొందరు అదికారులు కొందరిని గెలుపొందించిటకై పోటీలోవున్న ఇతర అభ్యర్దులకు మద్దతు ఇస్తున్న సంఘాల నాయుకులకు షోకాజ్ నోటీసులు, బెదిరింపులు చెస్తున్నారనీ వారు తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల గా వారు అందరికి అవకాశాలు ఇవ్వాలి గానీ ఇట్లా




చేయడం పట్ల ఖడిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సహాధక్షులు పి.రమేష్,అదనపు కార్యదర్శి మోపిదేవి శివశంకర్ రావు, పొన్నూరు మండల అధ్యక్షులు శ్రీ వినుకొండ య్య గారు తదితరులు పాల్గొన్నారు.

## పేదవిద్యార్థులకు లయన్స్ క్లబ్ సహాయం



తిరుపతి ప్రజాపాలన ప్రతినిధి: భవాని నగర్ నందలి నగరపాలక ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడి పేదవిద్యార్థులకు వంటకు ఉపయోగించే ప్రెజర్ కుక్కర్ ,నోటుబుక్స్, కాపీ రైటింగ్ బుక్స్ , బిస్కెట్ లను వితరణ చేసారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రార్ధించే పెదవులకన్నా సాయంచేసే చేతులు మిన్న అనే నినాదంతో పేదవిద్యార్థులకు పరీక్షలకు ఉపయోగపడే కాపీ రైటింగ్ బుక్స్, అంగన్వాడి పిల్లలకు ప్రజర్ కుక్కర్ వితరణ చెయడం జరిగిందని పేర్కొన్నారు. తరువాత చాకోలెట్స్ , బిస్కెట్ల ను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి రాజేంద్రప్రసాద్, లయన్స్ క్లబ్ అఫ్ సెవెన్ హిల్స్ కార్యదర్శి వి. జగన్నాథం, బెల్లంకొండ సురేష్, రోహిత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవరాజులు నాయుడు సిబ్బంది పాల్గొన్నారు

## దారపనేని నివాసంలో రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు



కనిగిరి ప్రజాపాలన ప్రతినిధి: కనిగిరి మాజీ ఏఎంసి చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ హైదరాబాదులోని స్వగృహంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి దారపనేని చంద్రశేఖర్ తో భేటీ అయినారు. ఇద్దరూ సుదీర్ఘ సమయం కనిగిరి నియోజకవర్గం లో జరుగుతున్న పరిణామాల మీద సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు పై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏ అభ్యర్థిని నిలబెట్టిన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామని , పేద బడుగు బలహీన వర్గాల వారికి వైసీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వారికి సంక్షేమ ఫలాలు అందజేయడమే జగనన్న ప్రభుత్వ ఉద్దేశం అని రాబోయే రోజులలో జగనన్న ప్రభుత్వానికి అన్ని సామాజిక వర్గాలు మద్దతు ఉంటుందని వారిద్దరూ ఆశాభావం వ్యక్తం చేశారు.

## విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించిన ఎం ఈ ఓ




ఉదయగిరి :ప్రజాపాలన ప్రతినిధి: ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి శ్రీ షేక్ మస్తాన్ వలి గారు ఎంపీపీ ఎస్ సున్నం వారి చింతల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతుల వారీగా విద్యార్థుల పఠన అభ్యసన నైపుణ్య సామర్థ్యాలను పరిశీలించారు. నల్లబల్లపై విద్యార్థుల గణిత సామర్థ్యాలను పరిశీలిస్తూ నాలుగు ఐదవ తరగతి విద్యార్థులకు కూడడం తీసివేయడం పెంచడం భాగించడం ఈ నాలుగు ప్రక్రియలు తప్పనిసరిగా వచ్చి ఉండాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. పాఠ్యపుస్తకాలలో ఉండే అభ్యాసాలే కాకుండా ఉపాధ్యాయులు తమ సొంతంగా అభ్యాసాలు తయారుచేసి ప్రతిరోజు విద్యార్థులకు హోంవర్క్ ఇవ్వవలెనని తెలియజేశారు. క్రమం తప్పకుండా ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టుల వర్క్ బుక్ లను పూర్తి చేసే విధంగా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని తెలియజేశారు. తదుపరి విద్యార్థుల,ఉపాధ్యాయుల, మధ్యాహ్న భోజన నిర్వాహకుల, ఆయాల అటెండెన్స్ రిజిస్టర్ లతోపాటు పాఠశాల యొక్క అన్ని రికార్డులను పరిశీలించారు. తదుపరి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తూ విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకుని ప్రతిరోజు మధ్యాహ్న భోజన రుచి శుచి కరముగా ఉండేటట్లు చూడాలని ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులకు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు తెలియజేశారు.


## ఏ.పి సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ను సమావేశపరచండి: ఆపస్ వినతి



విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి: ఉద్యోగ ఉపాధ్యాయ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దీని కనుగుణంగా నాలుగు సంఘాలతోనే కాకుండా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ లోని అన్ని సంఘాలతో సమావేశాలను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు సిహెచ్ శ్రావణ్ కుమార్ ఎస్ బాలాజీలు డిమాండ్ చేశారు. పిఎఫ్ ఏపీ జి ఎల్ ఐ బకాయిలు సత్వరం చెల్లించాలని పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని ఈనెల 7న జరగనున్న సమావేశంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో సభ్యసంఘాలన్నిటిని పిలవాలని వారు కోరారు.



## సొసైటీ సహకార బ్యాంకు భవనానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: సెంట్రల్ నియోజవర్గం .కుందా వారి కండ్రిక గ్రామంలో సొసైటీ సహకార బ్యాంకు పాత భవనం స్థానంలో కొత్త (44 లక్షల రూపాయల) భవనానికి భూమి పూజ చేసిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు మల్లాది విష్ణు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతూ శ్రీశైలజా రెడ్డి , కార్పొరేటర్ యార్లగొర్ల తిరుపతమ్మ , 30 డివిజన్ కార్పొరేటర్ బిహెచ్ఎస్ వి జానారెడ్డి , కో ఆప్షన్ సభ్యులు నందేపు జగదీష్ , నాయకులు యార్లగొర్ల శ్రీరాములు , బ్యాంకు డైరెక్టర్లు ,మేనేజర్ అధికారులు, స్థానిక గ్రామ పెద్దలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలోపాల్గొన్నారు.

## వికలాంగురాలికి వెలంపల్లి ఫౌండేషన్ బడ్డీ కొట్టు అందచేసిన వెలంపల్లి రాఘవ, కొనకళ్ల




విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: పశ్చిమ నియోజకవర్గం. భవాని పురం కోళ్లఫారం రోడ్లో ఒక వికలాంగురాలు నివాసం ఉంటూ తన ఇంటి వద్ద ఒక బడ్డి కొట్టులో చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉంటుంది అయితే మాజీ మంత్రివర్యులు, విజయావాడ పశ్చిమ నియోజకవర్గ. శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు స్థానిక 40వ డివిజన్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆ ప్రాంతంలో పర్యటిస్తున్నా క్రమంలో తమకు బడ్డి కావాలని ప్రస్తుతం ఉన్న బడ్డీ పాడై ఇబ్బందులు పడుతున్నాం అని కొంచెం చేయూత అందించాలని కోరగా స్పందించిన వెలంపల్లి శ్రీనివాసరావు. బడ్డి త్వరలో ఇస్తామని హామీ ఇచ్చారు అయితే ఇచ్చిన హామీ ప్రకారం శుక్రవారం నాడు వెలంపల్లి ఫౌండేషన్ సభ్యులైన వెలంపల్లి రాఘవ నరసింహారావు , కొనకళ్ల విద్యాధరరావు. కలిసి ఆమెకు బడ్డీని అందించారు. ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ యారడ్ల ఆంజనేయరెడ్డి , శేగు వెంకటేశ్వరరావు , నడికట్టు రమణ రెడ్డి, మల్లెల శ్రీనివాసరెడ్డి, శివరామి రెడ్డి , కళ్లం కృష్ణా రెడ్డి , డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా ఇల్లిపిల్లి అప్పలరాజు



విశాఖపట్నం ప్రజాపాలన ప్రతినిధి: గాజు వాక త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన ఇల్లిపిల్లి అప్పలరాజు తన ప్రచారానికి మరింత పదును పెట్టారు. తొలినుంచి సామాజిక సేవ చేయడమే పనిగా భావిస్తూ ప్రజాభిమానం పొందిన అప్పలరాజు ఇప్పుడు పెద్దల సభలో అడుగుపెట్టాలన్న ఆలోచనతో ఎన్నికల బరిలోకి దిగారు. సుఖీభవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి అందరి ప్రశంసలు పొందిన అప్పలరాజు తన ప్రచారాన్ని విస్తృతంచేశారు. ఉపాధ్యాయులసమస్యలను,నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై గళమెత్తగల సమర్థుడు అప్పలరాజు తనకు ఈ ఒక్క అవకాశం ఇవ్వండి అని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. తనను గెలిపిస్తే నిరంతరం పట్టభద్రులకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

## దుర్గగుడి ట్రస్ట్ బోర్డ్ సభ్యులు బుద్ధా రాంబాబుని కలిసిన సింహాచలం ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు కూరాకుల



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: శ్రీ దుర్గా మల్లేశ్వర దేవస్థానం ఇంద్రకీలాద్రి పాలక మండలి సభ్యునిగా నూతనంగా నియమితులైన బుద్ధ రాంబాబుని బ్రాహ్మణ వీధిలో తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి స్వామివారి లడ్డుప్రసాదాలను సింహాచల దేవస్థాన పాలకమండలి సభ్యుడు మరియు 47వ డివిజన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూరాకుల నాగ అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాజీ మంత్రివర్యులు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు పార్టీ లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్త కు అండగా నిలుస్తున్నారన్నదానికి నిదర్శనమే ఈ నామినేట్ పదవులుని కనకదుర్గమ్మ మరియు సింహాచల అప్పన్న స్వామి సేవ చేసుకున్న భాగ్యాన్ని కల్పించిన పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే శీనన్నకి కృతజ్ఞతలు తెలిపారు ఈకార్యక్రమంలో, తాండ్ర ఇంద్ర కుమార్. రెడపంగు క్రాంతి కుమార్, యాసలపూడి. శ్రీనివాసరావు. జిల్లెల్ల దుర్గారావు, తోరిటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడి కేంద్రం నందు తల్లి పిల్లల అవగాహన సదస్సు



నరసరావుపేట (ప్రజాపాలన): పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని క్రిస్టియన్ పాలెం అంగన్వాడీ కేంద్రం నందు వయసుకు తగిన ఎత్తు, బరువు లేని పిల్లల యొక్క తల్లులతో తల్లి పిల్లల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎస్ కె గౌసియా మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రం నందు ఉన్న పిల్లలకు మంచి పౌష్టికాహారము కోడిగుడ్లు మరియు నాణ్యమైనటువంటి ఆహారాన్ని ఇచ్చి, పిల్లలకు మంచి చదువు నేర్పించి, వారు భావితరాలకు ఆదర్శమూర్తులుగా ఉండేటట్లుగా అంగన్వాడి కేంద్రం టీచర్లు విద్య బోధించడం శుభపరిణామం అని కొనియాడారు. ఈ కార్యక్రమములో మహాలక్ష్మి, ఆశా వర్కర్ కోటేశ్వరమ్మ, మరియు ఏ డబ్ల్యు పి. కల్పనా జయకుమారి, బొమ్ము రాజ్యలక్ష్మి, వై స్వరూపారాణి, సిహెచ్ లక్ష్మి , పంగులూరి జయమ్మ మరియు పలువురు పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## బాపట్ల ఏరియామెరుగైన వైద్య సేవలు వైద్యశాలకు 12 మంది పీజీ వైద్యులు రాక



బాపట్ల జిల్లా ప్రజా పాలన ఫిబ్రవరి 3:బాపట్ల ఏరియా వైద్యశాలకు వైద్యం కోసం వెళ్లే రోగులకు మెరుగైన వైద్యం అందుతుంది. ఇప్పటికే బాపట్ల ఏరియా వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ వైద్యదేవోభవ అనే నినాదాన్ని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ ప్రాంతం వైద్య రంగంలో ముందడుగు వేస్తుందని చెప్పవచ్చు. వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారు బాపట్ల ఏరియా వైద్యశాల వైద్యులు. ఇందులో భాగంగా 12 మంది పీజీ వైద్యులు మూడు నెలల పాటు ఏరియా వైద్యశాలలో ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించనున్నారు. గుంటూరు, ఎన్నారై,కాటూరి వైద్యశాలల నుండి 12 మంది పీజీ వైద్య వైద్యుల బృందం నేడు బాపట్లకు చేరింది. వీరందరూ కూడా మూడు నెలలు పాటు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య పరమైన అన్ని వైద్య సేవలను అందిస్తారని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యశాల సూపరడెంట్ డాక్టర్ సిద్ధార్థ తెలియజేయడం జరిగింది.

## అంగరంగ వైభవంగా కోదండరాముని ప్రతిష్టాపన



నరసాపురం, మార్చి3 (ప్రజాపాలన ప్రతినిధి) :పట్టణంలోని మెయిన్ రోడ్డులో కొలువై ఉన్న కుమ్మరవీధి కోదండ రామాలయం స్వామివార్ల విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమాన్ని శుక్రవారం భారీ భక్తజన సందోహం మధ్య గోవింద నామస్మరణలతో హోరెత్తుతుండగా పండితుల వేద ఘోషల నడుమ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ గర్భాలయ, అంతరాలయ దాత కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు, శిరీష దంపతులు వారి తనయుడు కార్తికేయ నాయుడుల ఆధ్వర్యంలో స్వామి వార్లను పూలరథంపై ఉంచి పట్టణ వీధులలో ఒంటెలు, అశ్వాలు, విభిన్న ఆవులు, ఏనుగు, విచిత్ర వేషధారణలు, కేరళ వాయిద్యాలు, తీన్ మార్ డప్పులు, బుట్టబొమ్మలు, బాణాసంచా కాల్పుల నడుమ అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ప్రముఖ సిద్ధాంతి అనిల్ కుమారాచార్యుల పర్యవేక్షణలో వేద పండితుల మంత్రోచ్చరణలతో స్తోత్ర పారాయణం, పుణ్యహావాచన, యంత్రస్థాపన, మహాశాంతి హోమం, పూర్ణాహుతి, కళా వాహన, శాంతి కళ్యాణం తదితర పూజలు నిర్వహించి స్వామి వార్ల విగ్రహాలను ప్రతిష్టించారు. ఈ పునః ప్రతిష్టాపన కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రముఖులు, భక్తులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి పూజ, ప్రతిష్టాపన కార్యక్రమాలలో తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ ప్రతిష్టాపన కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, జనసేన పార్టీ ఇంచార్జ్ బొమ్మి డి నాయకర్, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ జయరాజు తదితరులు స్వామివార్లను దర్శించుకున్నారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయంలో సీతారాముల విగ్రహాలను శిరీష రామ్మోహన్ నాయుడు, లక్ష్మణస్వామి వారిని కొండా జయలక్ష్మి శ్రీధర్, ఆలయ శిఖరాన్ని ముఖమట్ల రమాదేవి వెంకట శ్రీనివాస్, ఆంజనేయస్వామిని దేవినేని రాధఫణి అనిల్, ధ్వజ ప్రతిష్టను కనగళ్ల రామలీలా సుబ్బారావు, గాలి గోపురాన్ని గుడివాడ సుప్రియ అయ్యప్ప, జయ విజయులను కోటిపల్లి దేవి వీరవెంకటసత్యనారాయణ, విఖానసచార్యుల విగ్రహాలను పెద్దింటి పద్మశ్రీ అనిల్ కుమారాచార్యుల దంపతులు ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి ప్రదీప్ ఆధ్వర్యంలో ప్రతిష్టించారు.


# కళాశాలలో అంగరంగ వైభవంగా BECTAGON -2023 ఉత్సవాలు




బాపట్ల జిల్లా ప్రజా పాలన ఫిబ్రవరి. 3: ఆంధ్రప్రదేశ్ లో విలక్షణ సాంకేతిక విద్యా కేంద్రంగా వినుతికెక్కిన బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో BECTAGON -2023 ఉత్సవాలు అంగరంగ వైభవముగా ప్రారంభమయ్యాయి. శుక్ర, శని వారాలలో 60కి పైగా సాంకేతిక, సాంస్కృతిక, సాహిత్య మరియు క్రీడా విభాగాలలో వివిధ పోటీలను జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం జరిగిన వివిధ విభాగాలకు సంబంధించిన అనేక పోటీలలో 700 మందికి పైగా వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం జరిగిన BECTAGON 2023 ప్రారంభోత్సవ సభలో చి వి. పూజ బృందం ప్రార్థన గీతాన్ని ఆలపించారు. చి జి. భువనేశ్వరి భరతనాట్యం ఆహుతులను అలరించింది. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు శ్రీ ముప్పలనేని శ్రీనివాస రావు , సెక్రటరీ మానం నాగేశ్వర రావు , వైస్ ప్రెసిడెంట్స్ శ్రీ దొప్పలపూడి రామ మోహన రావు , గెల్లి దిలీప్ కుమార్ మరియు ముఖ్య అతిధులు చక్రవర్తి, రమేష్ ఇంజనీరింగ్ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని సుసంపన్నం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నజీర్ మాట్లాడుతూ వివిధ కళాశాల నుండి ఉత్సాహంతో వివిధ పోటీలలో పాల్గొనటానికి వచ్చిన సాంకేతిక విద్యార్థులందరికీ తమ ప్రత్యేక అభినందలు తెలిపారు. BECTAGON కన్వీనర్ ప్రొఫెసర్ నిరంజన్ నివేదికను సమర్పించి వ్యయప్రయాసలతో కూడిన ఈ కార్యక్రమాలను నిర్వహించడంలో తమ వెన్నంటి వుండి, కావలసిన ప్రోత్సహాన్ని అందిస్తున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ యాజమానాన్యనికి తమ కృతజ్ఞతలను తెలిపారు.బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు గారు సభను ఉద్దేశించి మాట్లాడు తూ ఇటువంటి విభిన్న పోటీలను నిర్వహించటం చాల సంతోషంగా ఉందని, ఇవి విద్యార్థులలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసి వారు ఉన్నత శిఖరాల వైపు పయనిం చటానికి దోహదపడతాయని అన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల పురోభివృద్ధిలో విద్యా ప్రదాత మాన్యులు ముప్పలనేని శేషగిరిరావు పాత్ర మహోన్నతమైనదని అన్నారు. సెక్రటరీ శ్రీ మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ కోవిడ్ వల్ల గత రెండు సంవత్సరాలుగా BECTAGONను నిర్వహించలేక పోయామని ఈ సంవత్సరం BECTAGON -2023 ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని అంటూ విద్యార్థులకు ఉపయోగపడే ఎటువంటి కార్యక్రమాలకైనా తమ బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ సహకారం సంపూర్ణంగా ఉంటుందని అన్నారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన చక్రవర్తి గారు, వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ హెడ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కర్మ, జ్ఞాన, భక్తి యోగాల సమ్మేళితమైన భగవద్గీత సారాంశము ఆధునిక సాంకేతిక పరిజ్ఞానికి అనుసంధానమైన వైనాన్ని సవివరముగా వివరించారు. ఒక దశాబ్ద కాలం క్రితం బాపట్లను విద్యానందనంగా తీర్చి దిద్దిన మహోన్నతమైన వ్యక్తి కీ శే. ముప్పలనేని శేషగిరి రావు గారిని కలిసే అవకాశం కలిగిందని ఆయనకు విద్యపై ఉన్న నిశిత పరిశీలన మరియు ప్రత్యేక అవగాహనను చూసి చాలా అబ్బురపడ్డానని అన్నారు. సాంకేతిక రంగంలో రాణించాలంటే పట్టుదల, పరిశ్రమలతో పాటు ఇంటర్ డిస్సిప్లినరీ లెర్నింగ్ తప్పని సరిగా వుండాలని, నైపుణ్యం వున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాల కొరత ఏ మాత్రం లేదని అన్నారు. BECTAGON లాంటి బృహత్తర కార్యక్రమాన్ని చక్కటి ప్రణాళికలతో నిర్వహిస్తున్న బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీయాజమాన్యానికి, అధ్యాపక బృందానికి తమ ప్రత్యేక అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని చిషేక్ సమీర, చి జి. హేమంత్ లు చాలా సభారంజకంగానిర్వహించారు. కో కన్వీనర్ రత్న సునీల్ విచ్చేసిన సాంకేతిక విద్యార్థులకు తమ అభినందనలను తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, వివిధ సాకేంతిక కళాశాల విద్యార్థులు, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారి ప్రాణాదానం కోసం యువత స్పందన: మాజీ జడ్పిటిసి బోసు బాబు





గోకవరం , ప్రజాపాలన మార్చ్ 3 :రెక్క ఆడితే గాని డొక్కా ఆడని ఆ నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆ చిన్నారి ఆడుతూ పాడుతూ బుడి బుడి అడుగులు వేస్తూ అమ్మ నాన్న లతో కలిసి వారి కష్టం నా మైమరపించే (రెండుసంవత్సరాలు) అక్షయ్ రామ్ కి అంతుచిక్కని రోగం వెంబడిస్తుంది. ఆ చిన్నారికి బోన్ మారో ట్రాన్స్ప్లేషన్ చెయ్యాలని వైద్యులు తెలపడంతో ప్రస్తుతం ఆ చిన్నారిని కుటుంబ సభ్యులు తమిళనాడు చెన్నై పరిధిలో ఉన్న వేలూరు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తూన్నారు. బాబు కు సుమారు 30 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో ప్రస్తుతం ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఇటు బాబు కు వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక అటు బాబు ప్రాణం కాపాడేందుకు దాతలు ఎవరైన వస్తారని వేడుకుంటున్నారు. గోకవరం గ్రామానికి చెందిన పొట్నూరి సతీష్ దంపతుల జన్మించిన అక్షయ్ రామ్ కి వచ్చిన కష్టం తెలుసుకున్న మాజీ జడ్పిటిసి సభ్యులు పాలూరి బోసుబాబు ఇప్పటికే స్పందించి సాయం చేయడం తో పాటు తనకు తెలిసిన వారికి విషయం చెప్పి ఆర్థిక సాయం చేయడం జరుగుతుంది. విసంశెట్టి కృష్ణ కిరాణా వ్యాపారి ప్రతిరోజు తను మొదట అమ్మిన డబ్బులను దేవునికి సమర్పించడం కోసం డిబ్బి లో వేస్తున్నాడని బాబు పరిస్థితి తెలుసుకుని ఆ డబ్బుని దేవుని స్థానంలో బాబుకు అందజేయాలని మాజీ జడ్పిటిసి సభ్యులు బోసు బాబు కు సుమారు 6000 రూపాయలు అందజేశారు. స్కూల్, కాలేజీ లో కూడా విద్యార్థుల కు చెప్పి ఆర్థిక సాయం అందించాలని కోరుకుంటూ మరోపక్క యువత ముందుకు వచ్చి ఆ చిన్నారి వైద్యం కోసం ప్లే కార్డ్స్ తో బయలుదేరారు. ఆ చిన్నారి సహాయం కోసం యువతను స్వాగతిస్తూ పలువురు ఆ చిన్నారి కోసం సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రతి ఒక్కరూ చిన్నారి ప్రాణం సాయం కోసం స్పందించాలని కోరుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఈ చిన్నారి బాలుడు ఆపదను గుర్తించి ఆదుకోవాలని, ఆ చిన్నారి ప్రాణం సహాయం కోసం కృషి చేయాలని, ప్రజా ప్రతినిధులు శాసనసభ్యులు దృష్టికి తీసుకెళ్లి ఆ చిన్నారి బాబుకు జగనన్న ప్రభుత్వ తరపునుండి ప్రాణదానం చేసి ఆదుకోవాలని ఆ బాబు కుటుంబ సభ్యులు తో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

## బైకు అదుపు చేయలేక మట్టి దిబ్బలను ఢీ కొట్టి వ్యక్తి మృతి



గోకవరం ప్రజాపాలన మార్చ్ 3: బైక్ సడెన్ బ్రేక్ వేయడంతో అదుపు చేయలేక ప్రక్కనే ఉన్న మట్టిబెడ్డల దిబ్బనూ ఢీ కొట్టి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. దీనికి సంబంధించి గోకవరం ఏఎస్ఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం మండల కేంద్రమైన మండపేట గ్రామానికి చెందిన లేగా దుర్గా ప్రసాద్ (34) గురువారం రాత్రి గోకవరం బైక్ పై వస్తుండగా బావాజీపేట గ్రామ శివారులో ఉన్న హెచ్పి పెట్రోల్ బంక్ దగ్గరకు వచ్చుసరికి అక్కడ ఉన్న మట్టిబెడ్డల దిబ్బనూ చూసి బైక్ సడెన్ బ్రేక్ వేయడంతో బైక్ అదుపు చేయలేక ప్రక్కనే ఉన్న మట్టిబెడ్డల దిబ్బనూ ఢీ కొట్టి పడిపోగ అతడిని 108లో గోకవరం హాస్పిటల్ లో జాయిన్ చేయగా అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు తెలిపారన్నారు. మృతుడు దుర్గా ప్రసాద్ కు గతంలో వివాహం అయ్యి ఆమె చనిపోవటం తో రెండవ వివాహం గోకవరంకు చెందిన ఆమెను పెళ్ళి చేసుకున్నాడు, ఆమెను చూసేందుకు బైక్ పై వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. మృతుడు కి ఇద్దరు అమ్మాయిలు , ఒక అబ్బాయి సంతానం ఉన్నా రని , ముథూట్ ఫైనాన్స్ లో హౌసింగ్ మేనేజర్ గా పనిచేస్తున్నాడన్నారు. మృతుడు తండ్రి బంగారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

## నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతం కావాలి



కొవ్వూరు: ప్రజాపాలన ప్రతినిధి:తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు గెడ్డం గంగాచలం(జీ.జీ.చలం) చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం, పులిచర్ల మండలం, కొమ్మిరెడ్డి పల్లి నుంచి ప్రారంభమైన యువగళం పాదయాత్రలో తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ని మర్యాద పూర్వకంగా కలిసి ఆయన పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అధికారపార్టీ నియంతృత్వపాలనకు చరమగీతం పాడే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. యువగళం పాదయాత్రకు ప్రజల్లో అపూర్వ స్పందన వస్తుందని ఖచ్చితంగా వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారం చేజిక్కించుకోవడం ఖాయమని అన్నారు.


PAY BACK TO SOCIETY SNEHA CLUB

స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
శనివారం 04, మార్చి 2023

# ఈ సమ్మిట్ ఎవరి కోసం?

విశాఖపట్నంలో 2023 మార్చి 3,4 తేదీల్లో భారీ ఏర్పాట్లతో ప్రపంచ పెట్టుబడిదారుల సమ్మేళనానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సన్నాహాలు సాగిస్తున్నది. 40 దేశాల నుండి ప్రతినిధులు, దేశంలోని బడా పెట్టుబడిదారులు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు కొలువుదీరనున్నారు. ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబాయి, బెంగుళూర్, హైదరాబాద్‌లలో సదస్సులు పెట్టి కార్పొరేట్ కంపెనీలను విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023కు ముఖ్యమంత్రి స్వయంగా ఆహ్వానిస్తున్నారు. దేశాభివృద్ధికి పారిశ్రామిక ప్రగతి ఎంతో అవసరం. 1991లో పి.వి.నరసింహరావు ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో సరళీకరణ పేరుతో పారిశ్రామిక విధానాలను పూర్తిగా మార్చివేశారు. బడా పెట్టుబడిదారులకు, విదేశీ బహుళజాతి పెట్టుబడిదారులకు అనుకూలంగా పారిశ్రామిక విధానం మారిపోయింది. వామపక్ష ప్రభుత్వాలు తప్ప వీరికి రాయితీలు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం మరియు అన్ని రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. సింగిల్ విండోతో ప్రారంభమై నేడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 3 వారాల్లో అన్ని అనుమతులు ఇస్తూ దేశంలోనే ఫస్ట్ ర్యాంకులో ఉన్నామని జబ్బలు చరుచుకుంటోంది. కానీ గత నాలుగేళ్లలో పారిశ్రామిక అభివృద్ధికి చేసిన కృషి నామమాత్రం. పారిశ్రామిక వైఫల్యాలను కప్పిపుచ్చుకోవటానికి నేడు ఆర్భాటంగా ప్రచారం సాగిస్తున్నారు. తమ రాజకీయ ప్రయోజనాలకు సమ్మిట్‌ను ఉపయోగించుకుంటున్నారు. కార్పొరేట్లకు భూములు అప్పగించడం తప్ప కొత్తగా పరిశ్రమలు వస్తాయని ఆశించలేం. గతంలో 2013 భూ సేకరణ చట్టాన్ని రాష్ట్రంలో నేటికీ అమలు చేయలేదు. 2016 నుండి వరుసగా 3 సంవత్సరాలు సమ్మిట్లు సాగాయి. రూ.18.6 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. కానీ వచ్చింది రూ1.84 లక్షల కోట్లుగా గత ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హిందూస్థాన్ పెట్రోలియం విస్తరణకు ఖర్చుచేసిన రూ. 25 వేల కోట్లు కూడా ఉంది. ప్రభుత్వ రంగ పెట్టుబడులను కలిపినా 10 వ వంతు కూడా వాస్తవంగా పెట్టుబడులు రాలేదు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న అనేక అవకాశాల వల్ల వచ్చిన పరిశ్రమలే తప్ప సమ్మిట్ల వల్ల వచ్చింది లేదు. ఆంధ్రప్రదేశ్ వంటలు, గారెలు, బూరెలు తిని.. వచ్చిన ప్రతినిధులు ప్రభుత్వాన్ని ప్రశంసించి ఎం.ఓ.యులు చేస్తారు. విశాఖలోని రిషికొండలో డేటా సెంటర్ కోసం అదానికి 3 సార్లు 199 ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించాయి. 60 వేల ఉద్యోగాలు వస్తాయని అదాని ఆశలు పెట్టాడు. నేటికీ డేటా సెంటర్ నిర్మాణం కానీ, ఒక్కరికి ఉద్యోగం కానీ రాలేదు. ఇటీవల గౌతం అదాని బండారం గాలిబుడగలా బద్దలైనా ఈ సమ్మిట్‌కు ఆయనను ఆహ్వానించడంలో అర్థం ఏమిటి? పెట్టుబడిదారుల ముందు సాగిలా పడటాన్ని నలుగురు నవ్విపోతారని కూడా రాష్ట్ర ప్రభుత్వం వెనకాడటంలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా పెట్టుబడిదారులకు, విదేశీ బహుళజాతి పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలను రూపొందిస్తున్నాయి. కానీ దానిని కప్పి పుచ్చి పరిశ్రమల కోసం ప్రజల ఆర్థికాభివృద్ధికి పాటుపడుతున్నట్లు హైడ్రామాలు ఆడుతున్నాయి. విశాఖ సమ్మిట్‌కు సుమారు రూ. 250 కోట్లు ప్రజాధనం ఖర్చు కాగలదని అంచనా వేస్తున్నారు.. రాష్ట్ర ప్రభుత్వం బడా పెట్టుబడిదారులకు అనేక రూపాల్లో రాయితీలిస్తున్నది. భూములు, గనులు, సముద్రతీరం, విద్యుత్‌ను చౌకగా పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నారు. పెట్టుబడిదారులు మార్కెట్ రేటుకు రైతులు నుంచి భూములు కొనాలి. కానీ ప్రభుత్వాలే రైతులపై ఒత్తిడి చేసి బలవంతంగా రైతుల నుంచి భూములు చౌకగా లాక్కుంటున్నాయి. గత విద్యుత్ బోర్డు విధానం ప్రకారం పేదలకు విద్యుత్‌ను క్రాస్ సబ్సిడీ ద్వారా చౌకగా అందించాలి. నేడు పారిశ్రామిక వేత్తలకు విద్యుత్‌ను చౌకగా అందిస్తున్నారు. ఇతర రాష్ట్రాలను పోటీ చూపించి రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు ఎర్ర తివాచీలు వేసి ఆహ్వానిస్తున్నాయి. మోడీ ముఖ్యమంత్రిగా ఉండగా గుజరాత్‌లోని ముంద్ర పోర్టును అదానికి అప్పనంగా అప్పగించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పోర్టులన్నింటినీ ముఖ్యమంత్రి జగన్ నేడు అదానికి అప్పగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అదాని ప్రదేశ్‌గా మారుస్తున్నారు. ఈ విధానం రాష్ట్రానికి తీవ్రమైన హాని కలిగిస్తుంది. రాష్ట్ర ప్రయోజనం ఇందులో సున్నా. కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఉల్లంఘిస్తున్నాయి. 50 లక్షల మంది షెడ్యూల్ రంగంలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు పెంచలేదు. కాని ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. కార్మికుల నిజవేతనాలు పడిపోతున్నాయి.

ముఖ్యమంత్రి జగన్ ప్రతి రోజూ ఒక రంగం ప్రోత్సాహం గురించి ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఫుడ్ ప్రాసెస్ ఇండస్ట్రీ అభివృద్ధికి బ్రహ్మాండమైన అవకాశాలున్నాయని ఊదరగొట్టారు. 2022లో 6 షుగర్ ఫ్యాక్టరీలు ప్రభుత్వం మూసివేస్తూ జి.వో జారీచేసింది. షుగర్ పరిశ్రమను అభివృద్ధి చేయటానికి 'ఇథనాల్' ఉత్పత్తిని జోడించే ప్రక్రియ అన్ని ప్రైవేట్ షుగర్ ఫ్యాక్టరీలూ ప్రారంభించాయి. కానీ మన రాష్ట్రంలో ముఖ్యంగా కోఆపరేటీవ్ షుగర్ ఫ్యాక్టరీలన్నింటినీ మూసివేశారు. షుగర్ ఫ్యాక్టరీల స్థలాలు అమ్ముకోవటానికే రాష్ట్ర ప్రభుత్వం ఈ కుట్ర పన్నింది. ప్రజానీకానికి వంద సంవత్సరాలు తీపి తినిపించిన చెరుకు రైతుల పొట్టలు కొట్టింది. అధికారంలోకి వచ్చిన మొదటి 3 నెలల్లోనే విశాఖలోని చిట్టివలస, విజయనగరంలోని మరో మూడు జ్యూట్ మిల్లులు మూతపడ్డాయి. ఈ పరిశ్రమల్లో పనిచేసే 15 వేల మందిని రాష్ట్ర ప్రభుత్వం నడిరోడ్డుపై నెట్టింది. పంచదార, జ్యూట్ పరిశ్రమల కంటే ఫుడ్ ప్రాసెసింగ్ గొప్పదా ? గత నాలుగేళ్లలో వచ్చిన పరిశ్రమలన్నింటిలో వచ్చిన ఉద్యోగాలు ఎన్ని? ఉన్న పరిశ్రమలు మూసివేసిన కారణంగా.. పోయిన ఉద్యోగాలు ఎన్ని ? రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం ప్రకటించాలి.భారీ పరిశ్రమలు ఎందుకు రావడం లేదు? ప్రైవేటు అంటే లాభాలు. ఎన్ని సమ్మిట్లు పెట్టినా బాగా లాభాలు వస్తాయంటేనే పెట్టుబడిదారులు ముందుకు వస్తారు. 2008 నుండి ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం కొనసాగుతూ ఉంది. ఉపాధి భారీగా వచ్చే స్టీల్, అల్యూమినియం, జింక్, రాగి వంటి పరిశ్రమలన్నీ నష్టాల్లో ఉన్నాయి. భారీ పరిశ్రమల్లో ప్రైవేటు వారు పెట్టుబడులు పెట్టడానికి శ్రద్ధ చూపటం లేదు. దీనికి కారణం పెట్టుబడులు ఎక్కువ పెట్టాలి. పరిశ్రమ నిర్మాణానికి కనీసం 5 నుండి 10 సంవత్సరాలు పడుతుంది. అంటే లాభాలు రావడానికి ఆలస్యం అవుతుంది. ప్రైవేటు పెట్టుబడిదారులకు అర్జెంట్‌గా లాభాలు కావాలి. మన రాష్ట్రంలో గత 30 సంవత్సరాల్లో ఒక్క భారీ పరిశ్రమ కూడా రాలేదు. స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఎస్ఇజెడ్)లు మాత్రమే వస్తున్నాయి. ఈ జోన్‌లో పరిశ్రమలకు ఐదేళ్లపాటు పన్నులు ఉండవు. ఇవి సర్కస్ కంపెనీలు. కొంత కాలం తర్వాత వెళ్లిపోతాయి. తిరుపతి జిల్లా శ్రీ సిటి, అచ్యుతాపురం బ్రాండిక్స్ కంపెనీలు ఈ కోవకు చెందినవే. 20 సంవత్సరాల నుంచి విశాఖ – చెన్నరు పారిశ్రామిక కారిడార్‌లో భారీగా పరిశ్రమలు వస్తాయని ప్రభుత్వాలు ఎంత ఊదరకొట్టినా... అవి రావడంలేదు. ఈ కారిడార్‌లో ప్రతిపాదించిన కార్బన్, పెట్రో, పెట్రో రసాయనాల కాలుష్య పరిశ్రమలను ప్రజలు తిరస్కరిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌కు సముద్ర తీరం పారిశ్రామికాభివృద్ధికి ఎంతో అనుకూల ప్రదేశం. విశాఖలో ఏ రాజధాని లేకున్నా భారీ పరిశ్రమలు రావడానికి కారణం సముద్రతీరమే ప్రధాన కారణం.

# అమెరికన్ నగరంలో కులవివక్ష నిషేధం




సిస్కో కంపెనీలో పని చేస్తున్న దళిత సామాజిక తరగతికి చెందిన ఒక ఇంజనీరు అదే కంపెనీలో మేనేజర్లుగా పని చేస్తున్న మరో ఇద్దరు అగ్రకులాలుగా పరిగణించే వారు తన పట్ల వివక్ష చూపారన్న ఫిర్యాదు మీద సదరు కంపెనీ ఎలాంటి చర్య తీసుకోకపోగా తమ దగ్గర అలాంటి వివక్ష లేదని చెప్పుకుంది. ఫిర్యాదు చేసిన దళితుడిని పక్కన పెట్టింది. ఈ వార్త వెల్లడికాగానే అమెరికాలో కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్న 'ఈక్వాలిటీ లాబ్స్'కు... ఫేస్‌బుక్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబిఎం వంటి కంపెనీలలో కూడా అలాంటి పరిస్థితి ఉందంటూ అనేక ఫిర్యాదులు అందాయి. ఒత్తిడి పెరగటంతో సిస్కో సంస్థ జరిపిన విచారణలో వివక్ష నిజమే అని తేలింది. అమెరికాలో ఉన్న చట్టాల ప్రకారం కులం, తెగలకు సంబంధించి ఎలాంటి రక్షణ చట్టాల్లో లేనందున ఈ కేసును కొట్టివేయాలని కోర్టును కోరింది. ఈ కేసులో ఒక పక్షంగా చేరిన ఒక హిందూత్వ సంస్థ హిందూయిజానికి వివక్షకు సంబంధం లేదంటూ వాదనలు చేస్తున్నది. ఈ కేసు ఇంకా విచారణలో ఉంది. ఎక్కడైతే కుల వివక్ష పాటించబడుతున్నదో దానికి భారతీయులు కారణం కావటం సిగ్గుతో తల దించుకోవాల్సిన అంశం. ఎక్కడైతే అంటరానితనం మీద గళమెత్తారో అక్కడ కమ్యూనిస్టులు ఉండటం సగర్వంగా తల ఎత్తుకొనే పరిణామం. అమెరికాలో ఇప్పుడు జరిగింది అదే. కొద్ది రోజుల క్రితం కులవివక్షను నిషేధిస్తూ తీర్మానం చేసిన అమెరికాలోని ఏకైక నగరంలో సియాటిల్ కాగా అందుకు ఆద్యురాలు, కమ్యూనిస్టు కౌన్సిలర్ క్షమా సావంత్ అనే 49 సంవత్సరాల భారతీయ మహిళ. తొలిసారి ఎన్నికైనపుడు కనీస వేతనం గంటకు 15 డాలర్ల కంటే తక్కువ ఉండరాదంటూ ఆమె ప్రవేశపెట్టిన తీర్మానం నెగ్గింది. దాంతో అనేక నగరాల్లో అలాంటి తీర్మానాలకు తెర లేచింది. ఇప్పుడు కులవివక్షపై నిషేధం విధించాలంటూ ఆమె ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కౌన్సిల్ ఆమోదించింది. ఒక కమ్యూనిస్టుగా బాధ్యతల నిర్వహణలో సహజంగానే ఆమె కార్పొరేట్ల ఆగ్రహానికి గురయ్యారు. కౌన్సిలర్‌గా వెనక్కు పిలవాలంటూ తప్పుడు ఆరోపణలు చేసి ఓటింగ్ నిర్వహించారు. దానిలో కూడా ఆమె మెజారిటీ సాధించి తన సత్తాను చాటుకున్నారు. రాజీపడని ఒక సోషలిస్టును పదవి నుంచి తొలగించేందుకు చేసిన యత్నాలంటూ బ్రిటన్‌కు చెందిన ఇండిపెండెంట్ పత్రిక ''అమెరికాకు మరింత మంది కమ్యూనిస్టుల అవసరం ఏమిటి?" అనే శీర్షికతో 2021 డిసెంబరు 14న ఒక విశ్లేషణ రాసింది. కరోనా ఆంక్షలు అమల్లో ఉన్నపుడు మేయర్ ఇంటి ముందు ఒక నిరసన ప్రదర్శనలో మాట్లాడినందుకు గాను ఆమెను కౌన్సిలర్‌గా తొలగించాలని చూశారు. బడా వాణిజ్యవేత్తలు, మితవాదులు, కార్పొరేట్ మీడియా, రాజకీయవేత్తలు, కోర్టులు ఆమెను వదిలించుకోవాలని చూసినట్లు ఆ పత్రిక రాసింది. అమెరికా, ఐరోపా దేశాల్లో ఆఫ్రికన్లు, ఆసియన్లు, శ్వేతేతరులందరూ జాత్యహంకారానికి గురవుతున్నారు. భారతీయులు కూడా దానికి గురౌతున్నారు. కానీ వారిలో అగ్రకులం అనుకొనే వారు అక్కడ కూడా మిగతా వారి పట్ల కులవివక్షను పాటిస్తున్నారు. వీరిలో ఉద్యోగులు, విద్యార్థులు కూడా ఉన్నారు. అమెరికాలో భారత సంతతికి చెందిన వారు మొత్తం పాతికలక్షల మంది వున్నారు. సిస్కో కంపెనీలో పని చేస్తున్న దళిత సామాజిక తరగతికి చెందిన ఒక ఇంజనీరు అదే కంపెనీలో మేనేజర్లుగా పని చేస్తున్న మరో ఇద్దరు అగ్రకులాలుగా పరిగణించే వారు తన పట్ల వివక్ష చూపారన్న ఫిర్యాదు మీద సదరు కంపెనీ ఎలాంటి చర్య తీసుకోకపోగా తమ దగ్గర అలాంటి వివక్ష లేదని చెప్పుకుంది. ఫిర్యాదు చేసిన దళితుడిని పక్కన పెట్టింది. ఈ వార్త వెల్లడికాగానే అమెరికాలో కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్న 'ఈక్వాలిటీ లాబ్స్'కు... ఫేస్‌బుక్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబిఎం వంటి కంపెనీలలో కూడా అలాంటి పరిస్థితి ఉందంటూ అనేక ఫిర్యాదులు అందాయి. ఒత్తిడి పెరగటంతో సిస్కో సంస్థ జరిపిన విచారణలో వివక్ష నిజమే అని తేలింది. అమెరికాలో ఉన్న చట్టాల ప్రకారం కులం, తెగలకు సంబంధించి ఎలాంటి రక్షణ చట్టాల్లో లేనందున ఈ కేసును కొట్టివేయాలని కోర్టును కోరింది. ఈ కేసులో ఒక పక్షంగా చేరిన ఒక హిందూత్వ సంస్థ హిందూయిజానికి వివక్షకు సంబంధం లేదంటూ వాదనలు చేస్తున్నది. ఈ కేసు ఇంకా విచారణలో ఉంది.

తాజాగా సియాటిల్ నగరపాలక సంస్థ చేసిన నిర్ణయం ఈ కేసును ఎలా ప్రభావితం చేస్తుందో చూడాల్సి ఉంది. సిలికాన్ వ్యాలీలో "అగ్రహార వ్యాలీలు" ఉన్నాయని 'ఈక్వాలిటీ లాబ్స్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తనిమొళి సౌందరరాజన్ చెప్పారు (మన దేశంలో అగ్రహారాలు వివక్షకు ప్రతిరూపాలుగా ఉన్నందున ఆమె అలా వర్ణించారు. ఇప్పుడు అగ్రహారాలు లేని చోట్ల కూడా వివక్ష పాటించే వారందరికీ అది వర్తిస్తుంది). అమెరికాలోని స్వామి నారాయణ సంస్థ న్యూజెర్సీలో దేవాలయ నిర్మాణం కోసం రెండు వందల మంది బలహీన వర్గాలకు చెందిన వారిని అక్కడికి తీసుకుపోయి గంటకు కేవలం 1.2 డాలర్లు మాత్రమే ఇస్తూ సంవత్సరాల తరబడి పని చేయిస్తున్నట్లు అక్కడి మీడియా వెల్లడించింది. సిస్కో, ఈ దేవాలయ నిర్మాణంలో వెట్టి కార్మికుల కేసు ఇంకా పరిష్కారం కాలేదు.'ఈక్వాలిటీ లాబ్స్' 2016లో నిర్వహించిన ఒక సర్వేలో దిగువ కులాలుగా పరిగణించబడుతున్న తరగతులకు చెందిన వారిలో 41 శాతం మంది వివక్షకు గురవుతున్నారని చెప్పినట్లు తేలింది. అమెరికా స్కూళ్లు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలలో ఈ సర్వే జరిగింది. పని స్థలాల్లో వివక్షకు గురైనట్లు 67 శాతం చెప్పారు. మొత్తంగా దక్షిణాసియా వారు వివక్షకు గురవుతున్నప్పటికీ వారిలో అగ్రకులాలకు చెందిన వారు నామమాత్రంగా ఉన్నారని సర్వే తెలిపింది. కార్నెగీ సంస్థ 2020లో జరిపిన సర్వేలో అమెరికాలో జన్మించిన వారితో పోలిస్తే వలస వచ్చిన వారిలో ఎక్కువ మంది తమ కుల గుర్తింపును గట్టిగా చెప్పినట్లు తేలిసింది. పదిలో ఎనిమిది మంది తాము అగ్రకుల హిందువులమని చెప్పుకున్నారట. వివక్ష గురించి అడిగిన ప్రశ్నకు అమెరికాలో శ్వేతజాతి వివక్ష అమెరికా ప్రజాస్వామ్యానికి ముప్పని భారత సంతతికి చెందిన వారిలో 73 శాతం మంది చెప్పారు. అయితే భారత్‌లో హిందూత్వ మెజారిటీ వివక్ష ఇక్కడి ప్రజాస్వామ్యానికి ముప్పని వారిలో 53 శాతం మాత్రమే చెప్పారట.అమెరికా, ఇతర దేశాలలో ఉన్న దళితులు తాము ఎదుర్కొంటున్న వివక్ష, అవమానాలకు వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. సామాజిక మాధ్యమ వేదికలను ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారు, బాధితులకు ఆసరాగా నిలుస్తున్నారు. అలాంటి వారిలో సెల్వీ రాజన్ ఒకరు. ఆమె ఆర్గనైజ్ పేరుతో కుల వివక్ష వ్యతిరేక శక్తులను సమీకరిస్తున్నారు. ఆమె తలిదండ్రులు కులవివక్షను తప్పించుకొనేందుకు అమెరికా వలస వెళ్లారు. తాము భారత్ నుంచి అమెరికా వచ్చినా అక్కడా కుల ముద్ర వెంటాడుతోందని సెల్వీ ఆవేదన చెందారు. తన అనుభవం గురించి చెబుతూ దళితులు అమెరికాకు రావటం అరుదుగా ఉంటున్న స్థితిలో తనను అగ్రకులస్తురాలిగా భావించారన్నారు. ఒక ఆసియన్‌గా శ్వేతజాతి దురహంకారానికి గురైనట్లు చెప్పారు. తన రూమ్మేట్‌గా ఉన్న ఒక బ్రాహ్మణ యువతి తన వంట పాత్రల్లో మాంసం కాదు కదా గుడ్లు కూడా ఉడికించటానికి వీల్లేదని చెప్పినట్లు వెల్లడించారు. అమెరికాలో కూడా కులాన్ని పాటిస్తున్నందున ఇతరుల మాదిరే తోటి భారతీయుల ముందు కులాన్ని దాచుకోవాల్సి వచ్చిందన్నారు. కులతత్వానికి వ్యతిరేకంగా పోరాడకపోతే అమెరికాలో కూడా అది పాతుకుపోతుంది. అమెరికాలో జాత్యహంకారం, భారత్‌లో కులతత్వానికి దగ్గరి పోలికలు ఉన్నాయని రెండూ అణచివేతకు పాల్పడేవే అన్నారు. 2018లో జరిపిన ఒక సర్వే ప్రకారం 26 శాతం మంది దక్షిణాసియా వాసులు భౌతికదాడులకు గురైనట్లు, 59 శాతం మంది కులపరమైన వివక్షకు గురైనట్లు, సగం మంది తాము దళితులమని వెల్లడైతే దూరంగా పెడతారని భయపడినట్లు తేలింది. 2003లో పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలోని భారత అధ్యయన కేంద్ర సర్వే ప్రకారం భారత్ నుంచి వలస వచ్చిన వారిలో దళితులు కేవలం 1.5 శాతమే అని 90 శాతం మందికి పైగా తాము ఆధిపత్య కులాలకు చెందిన వారిగా చెప్పినట్లు తేలింది. అమెరికాలో జన్మించిన భారత సంతతివారితో పోలిస్తే వలస వచ్చిన వారితో కులవివక్ష సమస్య ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. ప్రీతి మేషరామ్ అనే దళిత యువతి అమెరికాలో తన అనుభవం గురించి చెబుతూ పార్టీలు జరుపుకునే సమయంలో ప్రతి గదిలో ఉన్నవారిని పలుకరించి కులం గురించి తెలుసుకున్నవారు తన వద్దకు వచ్చేసరికి ఇబ్బంది పడేవారని, కారణం తాను దళితురాలినని తెలియటమే అన్నారు. తనపై జరిగిన అత్యాచారం గురించి ఆమె వివరిస్తూ గ్రామాల్లో పొలాల్లో పని చేసే దళిత స్త్రీల శరీరాలకు తావే యజమానులమన్నట్లు ప్రవర్తించే భూస్వాముల మాదిరి ఒక అగ్రకుల విద్యార్థి తన పట్ల ప్రవర్తించాడని, ఆ విషయాన్ని అగ్రకులానికి చెందిన తన రూమ్మేట్‌కు చెబితే నమ్మకుండా తిట్టిందని మేషరామ్ చెప్పింది. రుజువు చేసే అవకాశాలు లేనందున ఫిర్యాదు చేయలేదని చెప్పింది. అమెరికాలోని దళితుల గురించి 'ఈక్వాలిటీ ల్యాబ్స్' జరిపిన సర్వే విశ్లేషణ ఫలితాలు ఇలా ఉన్నాయి. సర్వేలో పాల్గొన్నవారిలో 25 శాతం మంది భౌతిక లేదా దూషణ దాడికి గురయ్యారు. చదువుకొనేటపుడు ప్రతి ముగ్గురిలో ఒకరు వివక్షను అనుభవించారు. పని ప్రాంతాల్లో మూడింట రెండు వంతుల మంది పట్ల అనుచితంగా వ్యవహరించారు. అరవై శాతం మంది కులపరమైన జోక్స్ లేదా మాటలను ఎదుర్కొన్నారు. నలభై శాతం మంది దళితులు, 14 శాతం మంది శూద్రులను పని స్థలాల్లో ఎందుకు వచ్చారన్నట్లుగా చూశారు. తమ కులం కారణంగా వాణిజ్యంలో వివక్షకు గురైనట్లు 14 శాతం మంది దళితులు చెప్పారు.తమ కులం కారణంగా అమ్మాయిలు తమతో రొమాంటిక్ రిలేషన్‌షిప్‌కు తిరస్కరించినట్లు 40 శాతం మంది చెప్పారు. తమ కులాన్ని ఎక్కడ వెల్లడిస్తారో అనే భయం ప్రతి ఇద్దరు దళితుల్లో ఒకరు, ప్రతి నలుగురు శూద్రుల్లో ఒకరిలో ఉన్నట్లు వెల్లడైంది. అయితే అనేక మంది కులవివక్షను వ్యతిరేకిస్తానే ఆత్మన్యూనతకు లోనుకాకుండా తమ కులం గురించి గర్వంగా చెప్పుకొనే దళితులు కూడా గణనీయంగా ఉన్నారు. ప్రపంచీకరణలో దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలతో పాటు ప్రపంచవ్యాపితం అవుతున్న కులవివక్ష మహమ్మారికి వ్యతిరేకంగా దాన్ని వ్యతిరేకించే అందరితో కలసి పోరాడాల్సి ఉంది. మహారాష్ట్రకు చెందిన తమిళ కుటుంబానికి చెందిన క్షమా సావంత్ ముంబైలో చదువుకున్నారు. అక్కడ ఆమెకు వామపక్ష భావాలు వంటబట్టాయి. భర్త వివేక్ సావంత్‌తో కలసి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా అమెరికా వెళ్లిన ఆమె అక్కడ అర్థశాస్త్రం చదుకొని బోధనా వృత్తిని చేపట్టారు. సోషలిస్టు ప్రత్యామ్నాయం అనే ఒక కమ్యూనిస్టు పార్టీలో 2006లో చేరారు. ప్రస్తుతం ఆమె డెమోక్రటిక్ సోషలిస్టు పార్టీలో ఉన్నారు. సియాటిల్ నగరపాలక సంస్థకు తొలిసారిగా 2013లో ఎన్నికైన క్షమా ఈ ఏడాది ఆఖరి వరకు కౌన్సిలర్‌గా ఉంటారు. ప్రస్తుతం ఉన్న తొమ్మిది మందిలో ఆమే సీనియర్. వచ్చే ఎన్నికలలో తాను పోటీలో ఉండనని, కార్మిక ఉద్యమాల నిర్మాణానికి అంకితమౌతానని ఆమె ప్రకటించారు. మహిళలకు మాత్రమే ఆడవాళ్ల సమస్యలు తెలుస్తాయని, అలాగే దళితులకు మాత్రమే దళితుల సమస్యలు తెలుస్తాయని మిగతావారికి మాట్లాడే అర్హత లేదన్నట్లుగా వాదించేవారిని దళితురాలు కాని క్షమా సావంత్ ఆచరణ ఆలోచింపచేస్తుందా? ఎవరికైనా స్పందించే హృదయం, చిత్తశుద్ధి కావాలి.

## కాలరేఖ

కవ్వించే కాలరేఖపై
మనిషి పరిగెడుతున్నాడు
జీవితం లోతైన ప్రాముఖ్యతను తవ్వి చూడ్డానికి
తీరిక గుణపంలేదు
ఒకరికొకరు చేతులు కూర్చుకుని
చుట్టూ తిరుగుతూ చేసే చోబీ నృత్యంలాంటి
చిన్న సరదాలు పుంజుకునే రోజుల్లేవు
ముందు దున్నిన వంకర చాళ్ళను సరిదిద్దే మడకలేదు
బతుకులో పనసపండు వాసన లేదు
మనిషి గురించి చెప్పేవాళ్ళు లేరు
విలుకాండ్రున్నారు విల్లంబులున్నాయి
నేను పోరాడానని చెప్పే గాయపు గుర్తుల్లేవు
ఒక తూగు చప్పున మేల్కోవడం లేదు
విచ్ఛిన్న మవుతున్న కలలేవో యోచన లేదు
వర్ణించలేని దుఃఖం ఉంది
నేరం కుర్చీ నీడలో తప్పించుకునే దృశ్యాలున్నాయి
గుంజకు కట్టిన గుండె ఉంది
మధ్యమధ్యలో పుట్టే తాత్కాలిక ప్రేమలున్నాయి
కొంతసేపు తగిలించుకుని తీసివేసే
మంచితనం మాస్కులున్నాయి
ఒక కోరికకు ఒక గతానికి మధ్య చిక్కుకుని
జీవితంలోని అన్ని దశల నుంచి పారిపోవడముంది
తమ చీకటి గుహలో
సంపూర్ణ సౌకర్యవంతంగా ఉండడముంది
వనాల ప్రతినిధిగా ఓ ముళ్ళచెట్టుంది
ఏది వెనకుందో అదలాగే ఉంది

ఈ వెలుగు సరిపోదు
ఈ చేతులు సరిపోవు
ఈ చికిత్స సరిపోదు
లోతైన విషాదం ఏదో రోజుల్ని దాటుతోంది
ఇన్ని ప్రణాళికల దారి చివరిలో
గులకరాళ్ళ చప్పుడు ఆగలేదు
ఇది ప్రతిరోజూ రెక్కలు కత్తిరించే వాస్తవం
అలను అల నెట్టినట్టు
నొప్పిని నొప్పి నెడుతోంది
ఎక్కడా అద్దం దొరక్క
నిజం తనముఖాన్ని తాను చూసుకోలేదు
ఆ అద్దాన్ని చూపగలిగిన
అందర్నీ కనిపెట్టుకునే,కన్నీళ్ళు పెట్టుకునే
నిగూఢమైన నిజాయితీగల మనిషెక్కడ్డీ

– శాంతయోగి యోగానంద

# ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు కు ఘన నివాళులర్పించిన చంద్రబాబు నాయుడు

## పార్టీలకతీతంగా అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు



మచిలీపట్నం టౌన్ : ప్రజాపాలన మార్చి 3. మచిలీపట్నం మల్కాపట్నం లోని బచ్చుల అర్జునుడు స్వగృహానికి టిడిపి పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అర్జునుడు పార్థివ దేహానికి పూలమాలలువేసి, శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం భార్య పార్వతిని వొదర్చారు. కుటుంబ సభ్యులకు టిడిపి పార్టీ, నాయకులు అండగా ఉంటామని భరోసనిచ్చారు.గత నెలలో గుండె పోటుతో విజయవాడ రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందారు.తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు సందర్శనార్థం మచిలీపట్నం బచ్చుల అర్జునుడు స్వగృహంలో ఉంచారు. ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు కు పోలీసులు అధికార లాంఛనాలతో అంతిమ యాత్రను ప్రారంభించారు. అంత్యక్రియలు రామ నాయుడు పేట నుండి కోనే సెంటర్ల మీదుగా బందరకోట వరకు కొనసాగింది. పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు. నందమూరి తారక రామారావు ప్రారంభించిన తెలుగుదేశం పార్టీ లో కార్యకర్తగా జీవితం ప్రారంభించిన అర్జునుడు కృష్ణా కోపరేటివ్ బ్యాంకు వైస్ ప్రెసిడెంట్ గాను మున్సిపల్ చైర్మన్ గాను ఎమ్మెల్సీగాను ప్రజలకు సేవలు అందించారు. తెలుగుదేశం పార్టీ పట్ల ప్రజల పట్ల ఎంతో క్రమశిక్షణతో నిబద్ధత తో ఉన్న నాయకునికి బందరు ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు.

ఘన నివాళి అర్పించిన పేర్నినాని బచ్చుల అర్జునుడు పార్థివదేహానికి నివాళులర్పించిన మాజీ మంత్రి , మచిలీపట్నం శాసనసభ సభ్యులు పేర్ని నాని కన్నీటి పర్యంతం అయ్యి మచిలీపట్నానికి అర్జునుడు చేసిన సేవలను గుర్తుచేశారు. ఎన్నికల వరకే రాజకీయాలు చేయాలని అనంతరం వాటినీ వదిలి రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని అని బచ్చుల అర్జునుడు అనేవారని గుర్తుచేశారు. రాజకీయాల్లో పొరపొచ్చాలు వచ్చినా వెంటనే అర్జునుడి సతీమణి పార్వతి పేర్ని నానితో ఫోన్లో సంభాషించి అర్జునుడు పేర్ని నాని మధ్య ఏ విధమైనటువంటి భేద అభిప్రాయాలు లేకుండా చూసేవారని అన్నారు.బచ్చుల అర్జునుడు సతీమణి రాజకీయ జీవితం లో వెన్నుదన్నుగా నిలిచింది అని అన్నారు. బచ్చుల అర్జునుడు భౌతికంగా మనతో లేకపోయినా బందరు ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్ని కొనియాడారు.తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు బచ్చుల అర్జునుడు అమర్ రహే అని దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. బచ్చుల అర్జునుడు పార్థివదేహానికి సొంత ఊరు బందర్ కోట లో పోలీసులు అధికారిక లాంఛనాల మధ్య కుమారుడు బచ్చుల బోసు బాబు కన్నీటి పర్యంతం తో దహన సంస్కరణలు నిర్వహించారు. ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు సంతాపసూచికంగా ది మచిలీపట్నం కామర్స్ ఆఫ్ అసోసియేషన్ మధ్యాహ్నం రెండు గంటల వరకు కార్పొరేషన్ వ్యాపారస్తులు అందరు షాపులు మూసివేశారు. రాష్ట్ర తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు అచ్చం నాయుడు, దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, నెట్టెం రఘురాం, ఎంపీ కేశినేని నాని, కొనకళ్ళ నారాయణరావు,బోడె ప్రసాద్, వార్త ప్రభ ఎడిటర్ వీర్ల శ్రీరామ్ యాదవ్, రాజేంద్రప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా, కొనకళ్ళ బుల్లయ్య, రావి వెంకటేశ్వరరావు, నగరపాలక సంస్థ చైర్ పర్సన్ మోకా వెంకటేశ్వరమ్మ, మోటమర్రి బాబా ప్రసాద్, పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు

## భేటి బచావో భేటి పడావో.. ఆడపిల్లలను చదివిద్దాం



గోకవరం ప్రజా పాలన మార్చ్ 3: మండలం కేంద్రమైన గోకవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో భేటి బచావో భేటి పడావో అనే కార్యక్రమమును సి.హెచ్.ఓలు మేరీ,కృప. వైఎస్ రాయుడు హెల్త్ ఎడ్యుకేషన్ శైలజ ఆడపిల్లలను చదివిద్దాం ఆడపిల్లను కాపాడుకుందాం అనే అంశం గురించి మాట్లాడి విద్యార్థినులు అందరితో చెప్పించారు ఎంపీహెచ్ఓ వైఎస్ రాయుడు మాట్లాడుతూ నేటి సమాజంలో స్త్రీలు ఇంకా నువ్వు కొన్ని ప్రాంతాల్లో వెనకంజీలో ఉంటున్నారని స్త్రీలందరూ కూడా చదువుకోవాలని చదువుకొని అత్యున్నత స్థానాలు అధిరోహించి ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించి సమాజానికి దిక్సూచి కావాలని పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు సుజాత, నాగలక్ష్మి, సూర్యకాంతం, శ్రీనివాస్, భ్రూణహత్యలు నివారించాలని గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో సత్యనారాయణదొర ఆరోగ్య సిబ్బంది నుండి పవన్ రమణ పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా గంధం చంద్ర



శ్రీకాళహస్తి.... ప్రజా పాలన : అఖిల భారత దళిత, గిరిజనుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గంధం చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఆ సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం శుక్రవారం పట్టణంలో జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కూకట్లపల్లి ప్రసాద్జి అధ్యక్షతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రశేఖర్ ను ఎన్నుకుంటూ ఏకగ్రీవ తీర్మాణం చేశారు. తదనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు గడిచిపోతున్నా దళిత, గిరిజనులు రాజ్యాధికారానికి ఆమడదూరంలోనే ఉన్నారని వాపోయారు. అగ్రవర్ణాల చేతుల్లో పీడనకు గురవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత, గిరిజన బిడ్డలను జాత్యాంహాంకార పీడన నుంచి విముక్తి చేయడంతో పాటు రాజ్యాధికారం వైపు అడుగులు వేసేందుకు తనవంతు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేశారు.

## అమలాపురంలో ఘనంగా నిర్వహించిన జి ఎం సి బాలయోగి వర్ధంతి



అమలాపురం ఫిబ్రవరి03 ప్రజాపాలన ప్రతినిధి :అమలాపురం జీఎంసి బాలయోగి స్టేడియంలో శుక్రవారం ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నియోజకవర్గం జిల్లా కలెక్టరేట్ ఆనుకుని ఉన్న బాలయోగి షూట్,మరియు స్టేడియం వద్ద మాజీ లోక్ సభ స్పీకర్ గంటి మోహనచంద్ర బాలయోగి, సమాధి స్తూపం వద్ద శుక్రవారం ఆయన కుమారుడు హరీష్ మాధురి బాలయోగి సమక్షంలో జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తనయుడు మరియు అమలాపురం తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ ఇన్చార్జి మాధురి బాలయోగి మాట్లాడుతూ... నాన్నగారు అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చేసిన సేవలు ప్రతి ఒక్కరి హృదయములో కొలువై ఉన్నాయని, ఆయన ఆశయం అమలాపురం పట్టణానికి రైల్వే లైన్ ను తీసుకురావాలని ఆయన చేసిన కృషి మరువలేనిదని ఆయన గుర్తు చేశారు. ఆయన ఆశయ బాటలో రైల్వే లైన్ అమలాపురం మీదుగా నరసాపురం వెళ్ళటానికి తనవంతు గా కేంద్రంపై వత్తిడిని తీసుకొస్తానని ఆయన ఈ సందర్భంగా మరోసారి ఆయన తండ్రి అయిన బాలయోగిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా నూకాలమ్మ అమ్మవారి 4వ వార్షికోత్సవం



గోకవరం ప్రజాపాలన మార్చి 3:తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కృష్ణుని పాలెం రామన్నపాలెంలో మాతృశ్రీ నూకాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట నాలుగవ వసంతం పూర్తిచేసుకున్న సందర్భంగా ఘనంగా వార్షికోత్సవ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్టాపకులు గుండా శివప్రసాద్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వేడుకగా ఆర్కారిస్ బ్యూటీ పెజెంట్ కర్టెన్ రైజర్ కార్యక్రమం

**వేడుకగా ఆర్కారిస్ బ్యూటీ పెజెంట్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సందడి చేసిన బాలీవుడ్ భామలు మౌమిత బోస్, మేఘ్న బెనర్జీ**



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి: మహిళా సాధికారత, సామాజిక అభివృద్ధి లక్ష్యాలతో, మిస్టర్, మిస్, మిసెస్ బ్యూటీ పెజెంట్ ఇండియా అండ్ ఇంటర్నేషనల్ 2023ను నిర్వహిస్తున్నట్లు ఆర్కారిస్ నిర్వాహకులు తెలియజేశారు. బ్యూటీ పెజెంట్ ఈవెంట్ కర్టెన్ రైజర్ కార్యక్రమం సంస్థ ప్రతినిధులు, పలువురు ప్రముఖుల సమక్షంలో గురువారం వేడుకగా జరిగింది. ఏలూరురోడ్డులోని పార్క్ హయత్ హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో బాలీవుడ్ అందాల భామలు మౌమిత బోస్, మేఘ్న బెనర్జీ పాల్గొని సందడి చేశారు. ఆర్కారిస్ బ్యూటీ పెజెంట్ 2023 ఈవెంట్ బ్రోచరును ఈ సందర్భంగా నిర్వాహకులు ఆవిష్కరించారు. అనంతరం ఆర్కారిస్ డైరెక్టర్ డాక్టర్ హిమాంశు తివారీ మాట్లాడుతూ, సామాజిక బాధ్యత, దృఢమైన వ్యక్తిత్వం కలిగిన వారిని గుర్తించి, అంతర్జాతీయ స్థాయిలో స్ఫూర్తిప్రదాతలుగా నిలబెట్టే వేదికగా బ్యూటీ పెజెంట్ ఈవెంట్ కు రూపకల్పన చేశామని అన్నారు. బ్యూటీ పెజెంట్ నిర్వాహక సంస్థ ఆర్కారిస్ ఈవెంట్స్ అండ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ డాక్టర్ హిమాంశు తివారీ మాట్లాడుతూ, అశ్లీలతకు ఏమాత్రం తావులేకుండా, మన సంస్కృతిని ప్రతిబింబింబిస్తూ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. బ్యూటీ పెజెంట్ కు అఫీషియల్ ఛానల్ భాగస్వామిగా వ్యవహరిస్తున్న శ్రావణి మీడియా అధినేత శ్రావణి వెన్నం మాట్లాడుతూ, మిసెస్ యూనివర్స్ సౌత్ ఈస్ట్ ఏషియా వి.వి. మంజులకుమారి మార్గదర్శకత్వంలో ఆర్కారిస్ గ్రూమింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ బ్యూటీ పెజెంట్ ఈవెంట్ జరుగుతుందని, కాన్సెప్ట్ ప్రమోటర్ గా శ్రీ మణికంఠ కన్స్ట్రక్షన్స్, క్లినికల్ పార్ట్నర్ గా యాపిల్ హెల్త్ కేర్ క్లినిక్, కవరేజ్ పార్ట్నర్ గా పాండా స్టిల్స్ బై ప్రశాంత్, బ్రాండింగ్ పార్ట్నర్ గా రీసెర్చ్ మీడియా, గ్లోబల్ సోషల్ సర్వీస్ పార్ట్నర్ గా కృష్ణనంద, రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ పార్ట్నర్ గా వరనాస్ హెల్త్ కేర్ అండ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్, ఫిట్నెస్ పార్ట్నర్ గా 69 వ్యవహరిస్తున్నాయని తెలియజేశారు. బాలీవుడ్ భామలు మౌమిత బోస్, మేఘ్న బెనర్జీ మాట్లాడుతూ, శక్తి స్వరూపిణి అయిన కనకదుర్గమ్మ కొలువైయున్న బెజవాడలో జరుగుతున్న మహిళా సాధికారత లక్ష్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మిసెస్ యూనివర్స్ సౌత్ ఈస్ట్ ఏషియా వి.వి. మంజుల కుమారి, అను హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కే శ్రీదేవి,శ్రీవాణి కన్స్ట్రక్షన్స్ చైర్మన్ లయన్ మూల్పూరి సురేంద్ర, యాపిల్ హెల్త్ కేర్ సెంటర్ అధినేత డాక్టర్ రాంచంద్ చిలకపాటి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక రాజకీయాలతో కుమ్మక్కైన జాతీయ రహదారుల పిడి

**కమర్షియల్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు?**



రాజమహేంద్రవరం : ప్రజా పాలన ప్రతినిధి: జాతీయ రహదారుల ప్రాదీకార సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేంద్రనాథ్ స్థానిక రాజకీయ నాయకులతో కుమ్మక్కై కమర్షియల్ ప్రాంతాల్లో జాతీయ రహదారి అభివృద్ధి పనులు చేస్తున్నారని తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అచ్చన్నపాలెం కు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు దండమూరి శ్రీనివాస్ పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సంస్థ కార్మిక విభాగం అధ్యక్షులు పిల్లి కాంతారావులు విమర్శించారు. నల్లజర్ల మండలంలోని అచ్చన్న పల్లి గ్రామంలో గ్రామస్తుల నివసించే ప్రాంతాన్ని వదిలేసి కమర్షియల్ ప్రాంతాలైన నల్లజర్ల వైపు గ్రామ సర్పంచ్ జాలిపత్తి రత్తయ్య వ్యవసాయ భూముల వద్ద దండమూడి శ్రీనివాసకు చెందిన కమర్షియల్ ప్రాంతాల వద్ద కాంగ్రెస్ డ్రైనేజీ నిర్మిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా ఉమ్మడి ప్రజలు ప్రయోజనాలను కాదని కమర్షియల్ ప్రాంతాల వైపు సమస్త పిడి ఒత్తిళ్లకుగురవుతున్నారని గురవుతున్నారని ఈ ఆహారంలో భారీ స్థాయిలో ముడుపులు అందుకుంటున్నారని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల ప్రయోజనాలను కోరుతూ చాలాసార్లు పిడి దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ గ్రామస్తులు పట్ల నాయకుల పట్ల అనుచితంగా దురుసుగా ప్రవర్తిస్తున్నారని వారు విమర్శించారు. వీడి వ్యవహార శైలిపై కేంద్ర ప్రభుత్వం ఉన్నతాధికారుల దృష్టికి ఫిర్యాదు చేయనున్నట్లు వారు హెచ్చరించారు. జాతీయ రహదారి నిర్మాణంలోనూ చాలా చోట్ల కమర్షియల్ ప్రాంతాల వైపు రాజకీయంగా ఆర్థికంగా ఒత్తిళ్లకు గురై అలైన్మెంట్ మార్చిన సంఘటన గతంలో చోటుచేసుకున్నాయని ఎన్నో ఆందోళనలు వ్యక్తం చేశామని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కమర్షియల్ ప్రాంతాల వైపు డ్రైనేజీ నిర్మాణం నిలుపుదల చేయకపోయినట్లయితే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ప్రజలతోను ప్రతిపక్ష నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

## శ్రీరాముని గాథ వింటే పునర్జన్మ: చాగంటి కోటేశ్వరరావు



నరసాపురం, మార్చి 3 (ప్రజాపాలన ప్రతినిధి) : శ్రీరామ గాథ వింటే చనిపోయే వారు కూడా బ్రతుకుతారని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ధార్మిక ఉపన్యాస వాచస్పతి చాగంటి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక కుమ్మరవీధి కోదండ రామాలయ పునః ప్రతిష్టాపన ఉత్సవాలలో బాగంగా కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో నాలుగవ రోజు గురువారం రాత్రి నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో చాగంటి కోటేశ్వరరావు పాల్గొని ఆధ్యాత్మిక ప్రవచనాలు అందించారు. రామగాథ వింటే చనిపోయే వారు బ్రతుకుతారని, అదేవిధంగా హనుమంతుడు, చంపావతి మొదలగు వానరులు, అశోకవనంలో సీతాదేవి వీరందరూ చనిపోవడానికి సిద్దంగా ఉన్న సమయంలో వారిని రామగాథ బ్రతికించిదని అన్నారు. సమాజం పట్ల బాధ్యతతో ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్న కొవ్వలి రామ్మోహన్ నాయుడును ఆయన అభినందించారు. సభాధ్యక్షుడు గురుసహస్ర అవధాని కడిమిళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ శ్రీరాముని 30 తరాలను ఏ విదమైన పుస్తకం చూడకుండా చెప్పగల వ్యక్తి కోటేశ్వరరావు అని అన్నారు. కొంతమంది వక్తలకు అభిమానులు ఉంటారు కానీ చాగంటి కోటేశ్వరరావుకి భక్తులు ఉంటారని అన్నారు. కొందరు ప్రసంగాలు వింటూ నవ్వుకుంటారని, చాగంటి ప్రసంగంలో లీనమై పోతారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, కొవ్వలి రామ్మోహన్ నాయుడు, డీఎస్పీ రవి మనోహరాచారి, పొన్నపల్లి శ్రీరామారావు, పేరాల మోహన్, కోదండ రామాలయ కమిటీ సభ్యులు చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ అధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమానికి నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు, రాజకీయ వేత్తలు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

## పట్టణంలో పర్యటించిన మున్సిపల్ కమిషనర్ జయరాం

నందిగామ ప్రజాపాలన ప్రతినిధి: పట్టణ పరిధిలో 06 వవార్డు నందు ది.03-03-2023 వతేదీన శుక్రవారం రోజున మున్సిపల్ కమిషనర్ జయరాం పర్యటించారు. వార్డులో జరుగుచున్న పారిశుద్ధ్య పనులలో భాగంగా కాలవల యందు దోమల మందు పిచికారిని పరిశీలించారు. వార్డులో ప్రధాన డ్రెయిన్లతో పాటు కల్వర్ట్ లను పరిశీలించారు. వార్డులోని ప్రజలకు హెల్త్ సెక్రెటరీలు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి తెలిపారు. మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో యాంటీ లార్వా ఆపరేషన్ పనులను నిర్వహించి దోమలను లార్వా దశలోనే నిర్మూలించే విధముగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యముగా కాలవల వెంబడి పెరుగుతున్న పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. వార్డులోని అన్నీ వీధులలో పారిశుద్ధ్య పనితీరు మరియు ఇంటింటి తడి చెత్త - పొడి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించి పరిసరాలు పరిశుభ్రముగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమములో వార్డు కౌన్సిలర్ షేక్ యాకూబ్ అలీ మరియు ysrcp నాయకులు అమీన్ , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నదాతకు అండదండగా జగనన్న సర్కారు: రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : రైతు ఆర్థిక ప్రగతికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. కుందావారి కండ్రికలో రూ. 43 లక్షల వ్యయంతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(కెడిసిసి) నూతన భవన నిర్మాణానికి డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ శ్రీరాములుతో కలిసి శుక్రవారం ఆయన భూమిపూజ నిర్వహించారు. తొలుత దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ కండ్రిక, పాతపాడు, సీతారామపురం, మంగళాపురం, అప్పారావుపేట, నైనవరం గ్రామాల రైతులకు మేలు చేకూరే విధంగా అధునాతన హంగులతో స్ట్రాంగ్ రూమ్ సదుపాయం ఉండేలా భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన రైతన్నలకు ఒక స్వర్ణయుగమని కితాబిచ్చారు. జనాభాలో 62 శాతం మందికి ఉపాధి అవకాశాలు కల్పించే వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని పేర్కొన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా పథకం, రాయితీ విత్తనాలు, పురుగుమందులు, యాంత్రీకీకరణ పరికరాలు వంటి సంక్షేమ పథకాలతో మూడున్నరేళ్లలో అక్షారాల రూ. లక్షా 46 వేల కోట్ల లబ్ధిని అన్నదాతలకు చేకూర్చినట్లు వివరించారు. రైతు భరోసా ద్వారా ఇప్పటివరకు 52.38 లక్షల మందికి రూ. 27 వేల కోట్లు అందించినట్లు మల్లాది విష్ణు తెలిపారు. ఉచిత పంటల బీమా ద్వారా 44.28 లక్షల మందికి రూ. 6,685 కోట్ల మేలు చేకూర్చడం జరిగిందన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వం కంటే అధికంగా మూడున్నరేళ్లలో రూ. 55,401 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసినట్లు మల్లాది విష్ణు చెప్పారు. ఒక్క కండ్రికలోనే రూ. 5 కోట్లతో ధాన్యాన్ని సేకరించినట్లు తెలియజేశారు. అలాగే ఈ ప్రాంతంలో ఎన్.పి.ఎస్.సి. గొడౌన్ నిర్మాణానికి కూడా సన్నాహాలు చేస్తున్నట్లు మల్లాది విష్ణు వివరించారు. మరోవైపు ఎన్.ఎస్.సి.బోస్ నగర్ నుంచి కుందావారి కండ్రిక వరకు రహదారి నిర్మాణానికి రూ. 3 కోట్లతో టెండర్లను పిలవగా త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా అన్నదాతల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ ఎమ్మెల్యే మల్లాది విష్ణుని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కనకదుర్మమ్మ దేవస్థాన ఛైర్మన్ కర్నాటి రాంబాబు, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ జానారెడ్డి, కోఆప్షన్ సభ్యులు నందెపు జగదీష్, సొసైటీ అధ్యక్షులు ఎం.రవీందర్ రెడ్డి, సభ్యులు పసుపులేటి వెంకట్రావు, దావు కోటేశ్వరరావు, పాలకేంద్రం అధ్యక్షులు దేవిరెడ్డి మంగారెడ్డి, అన్నదాతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## బచ్చుల మృతి పార్టీకి తీరనీలోటు :మాజీ ఎమ్మెల్యే రావి



గుడివాడ : ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు మృతి టిడిపికి లోటుని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ బచ్చుల మృతి తెలుగు దేశం పార్టీకి తీరని లోటన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వ్యక్తి బచ్చుల అర్జునుడుడన్నారు. ఈ కార్యాక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నాయకులు కాకరాల సురేష్, యలమంచిలి సతీష్, కంచర్ల సుధాకార్, తదితరులు పాల్గొన్నారు. వెనిగండ్ల పౌండేషన్ అధ్వర్యంలో తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు మృతికి :వెనిగండ్ల పౌండేషన్ అధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో తులసి బాబు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చల్లగుళ్ళ సుబ్రహ్మణ్యేశ్వరరావు, శంకరపాడు, తుమ్మలపల్లి సర్పంచ్‌లు కైలే సుబ్బారావు, రాధాకృష్ణ, నాయకులు తులసి రాణి, బొంబాయి శ్రీను, కంచనపల్లి సుబ్రహ్మణ్యం, అడుసుమిల్లి, లక్ష్మణరావు, ఐనంపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 4 లోగా ఈ-క్రాప్, ఈ-కేవైసీ పూర్తిచేయాలి: జాయింట్ కలెక్టర్



మచిలీపట్నం కలెక్టరేట్ : ప్రజాపాలన మార్చి 3. జిల్లాలో రబీ పంట కాలంలో వివిధ వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగుచేసిన రైతులు మార్చి 4లోగా ఈ-క్రాప్, ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు.గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు చేపట్టిన ఈ-క్రాప్ యాప్లో రైతులసాగు వివరాల నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియ ఈ నెల 4వ తేదీతో ముగియనున్నదని ఆమె తెలిపారు.ఇప్పటి వరకు జిల్లాలో 3,13,404 ఎకరాలలో సాగుచేసిన వివిధ పంటలకు ఈ-క్రాప్ నమోదు చేయగాఅందులో 2,94,307 ఎకరాలలో 1,09,381 మంది రైతులకు ఈ-కేవైసీ పూర్తయ్యిందని, మిగిలిన రైతులు కూడా త్వరితగతిన రైతు భరోసా కేంద్రాలలోని వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులనుసంప్రదించి ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. ఆధార్తో లింక్ చేయబడిన మొబైల్ నెంబరుకుఓటీపీ ద్వారా కూడా ఈ-కేవైసీని చేయించుకోవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

## కానూరి వెంకటేశ్వరరావు కి పదివేల రూపాయల ఆర్థిక సహాయం చేసిన బొల్లా రామకృష్ణ



వత్సవాయిమార్చ్3ప్రజాపాలన ప్రతినిధి: మండలప రిధిలో తాళ్ళూరు గ్రామంలో తానూరి వెంకట్ రావు కుమారుడు తానూరి వెంకటేశ్వర రావు అనారోగ్యం బారినపడినారు ఆయనను రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బొల్లా రామకృష్ణ పరామర్శించి ఆ ర్థిక సహాయంగా (10,000) పదివేల రూపాయలను సహాయంగా అందించారుఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ షేక్ సొంద్ మియా ఉప సర్పంచ్ ప్రసా దపు రమేష్ ప్రసాదపు శ్రీనివాసరావు బొల్లా వెంకట సాయి మరియు తదితరులు పాల్గొన్నారు

# పేదల సంక్షేమమే ప్రధాన అజెండా..

## రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు

### 64 వ డివిజన్ 285 వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమమే ప్రధాన అజెండాగా తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందని ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. శుక్రవారం 64 వ డివిజన్ 285 వ వార్డు సచివాలయ పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజాశక్తి నగర్, రాధానగర్లలో విస్తృతంగా పర్యటించి 241 గడపలను సందర్శించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా వారి కుటుంబాలకు అందుతున్న సంక్షేమ లబ్ధి వివరాల కరపత్రాలను అందజేశారు. ఏమైనా సాంకేతిక కారణాల వలన పథకాలు అందకపోతే.. వారికి న్యాయం చేయడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్లు మల్లాది విష్ణు తెలిపారు. అలాగే గత మూడున్నరేళ్లలో ప్రాంతంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటున్నారని.. వారి సేవలను వినియోగించుకోవలసిందిగా వయోవృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సూచించారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రోజురోజుకి పెరుగుతున్న జనాదరణ చూసి నారా లోకేష్, టీడీపీ నేతలకు ముచ్చెటమలు పడుతున్నాయని మల్లాది విష్ణు విమర్శించారు. అందుకే పాదయాత్ర పేరుతో అసత్య ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ రామకోటేశ్వరారవు, సీడీఓ జగదీశ్వరి, కోఆప్షన్ సభ్యులు నందెపు జగదీష్, వైసీపీ డివిజన్ కోఆర్డినేటర్ ఎస్.కె.ఇస్మాయిల్, అధ్యక్షులు జిల్లెల్ల శివ, నాయకులు యరగొర్ల శ్రీరాములు, అక్తిశెట్టి నారాయణ, పందిరి వాసు, మేడా రమేష్, చెక్కా నరసింహరావు, తాండవకోటి చైతన్య, ఎస్.కె.భాష, సునీల, బాబ్జి, మహేష్, గురాల యేసు బాబు, మీసాల రామకృష్ణ, అగురు త్రినాథ్, వెంకటేశ్వమ్మ, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మానవసేవే మాధవసేవఅన్న జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ



మచిలీపట్నం టౌన్ : ప్రజాపాలన మార్చి 3.:ఆర్కే ఫౌండేషన్ ద్వారా ఆర్ సిఎం చర్చ్ స్నేహాలయ వృద్ధాశ్రమంలో వృద్ధుల కొరకు ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్ ను జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ ప్రారంభించారు. కంటేనేఅమ్మ కాదని వృద్ధాప్యంలో ఉన్న ప్రతి ఒక్కరూ మనకు తల్లిదండ్రులతో సమానమని రామకృష్ణ అన్నారు. వృద్ధులకు సేవ చేయటం మన వంతు సహాయ సహకారాలు అందించడం మన తల్లిదండ్రులకు సేవ చేయడమేనని మన ఆదాయంలో కొంత భాగాన్ని ఇటువంటి సేవా కార్యక్రమాలకు వినియోగిస్తూ సమాజంలో పేదల పట్ల మానవత్వం తో మెలగాలని అన్నారు ఆశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ ఆర్కే ఫౌండేషన్ ద్వారా గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రతినెల 25 వేల రూపాయల ఆర్థిక సాయం మా వృద్ధాశ్రమానికి అందిస్తున్నారని నేడు ఆరోప్లాంట్ ను అందించి వృద్ధాశ్రమం లోని వృద్ధులకు ఆరోగ్యకరమైన త్రాగునీరును అందించారని కరోనా లాంటి విపత్కర సమయంలో మా వృద్ధాశ్రమానికి రామకృష్ణ అందించిన సహాయ సహకారాలు మరువలేనివని వృద్ధాశ్రమ ప్రతినిధులు రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, మైకేల్ ,నరసింహ ఆశ్రమ ప్రతినిధులు,సిస్టర్ జిమ్మి తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శిలువ మార్గం



గుడివాడ : క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఉపవాసదీక్షలలో భాగంగా ప్రపంచ శాంతి వర్ధిల్లాలని కోరుతూ నిర్వహిస్తున్న క్రీస్తు శిలువ మార్గ యాత్రలు నందివాడ మండలంలోని నూతులపాడులోని (ఆర్‌సిఎం) చర్చి ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం ఆర్‌సిఎం విచారణ గురువు ఫాదర్ గుజ్జుల మైఖేల్, సహాయగురువు ఫాదర్ రవికాంత్‌లు ప్రత్యేక ప్రార్ధనలతో, యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపస్సు కాలమైన 40 రోజుల పాటు ప్రతి గ్రామంలో శిలువ మార్గాలను గుడ్‌ఫ్రైడే వరకు నిర్వహిస్తారన్నారు. ఈ యాత్రలలో దీక్షాపరులు, కుటుంబ క్రైస్తవులు పాల్గొని ప్రభువు చూపిన మార్గంలో పయనించాలన్నారు. ప్రతి వీధిలో 14 స్థలాలు (ఘట్టాలను) వివరిస్తూ శిలువ మార్గాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిస్టర్సు, ఉపదేశకులు సబ్బాష్టీయన్, భాస్కర్, ఆంతోని, క్రీసురాజు, కిరణ్, సంఘ పెద్దలు, మరియదళ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లూరు జీయ్యన్న స్వామి ఆలయంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, వేణి దంపతులు ప్రత్యేక పూజలు



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి :గండేపల్లి మండలం తాళ్లూరు జీయ్యన్న స్వామి ఆలయంలో శుక్రవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, వేణి దంపతులు స్వామివారిని దర్శించుకుని,ప్రత్యేక పూజలు నిర్వహించారు.మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలికారు.ఈరోజు ఎమ్మెల్యే చంటిబాబు దంపతుల పెళ్లిరోజు కావడంతో వేద పండితులు ఆశీర్వాదాలు అందజేశారు. పలువురు ఎమ్మెల్యే దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కందుల చిట్టిబాబు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ కబాడీ పోటీకి ఎంపిక



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి: మార్చ్3: జాతీయ కబడి పోటీకి జగ్గంపేట ప్రభుత్వ ఉన్న పాఠశాల విద్యార్థులు ఎంపికైనారు అని వ్యాయామ ఉపాధ్యాయులు బి మురళి కుమార్ బి శివ తెలియజేశారు ఫిబ్రవరి 26 వ తేదీ నుండి మార్చి రెండవ తేదీ వరకు చిత్తూరు జిల్లా నగరి గ్రామంలో అండర్ 14 బాలురు బాలికల రాష్ట్రస్థాయి కబాడీ పోటీలు నిర్వహించడం జరిగినది దీని లో జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు ఎం వెంకట దుర్గా మహాలక్ష్మి కె వాణి అమూల్య పాల్గొన్నారు దీనిలో మంచి ప్రతిభ కనబరిచి ఎం వెంకట దుర్గా మహాలక్ష్మి జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనారని తెలియపరిచినారు విద్యార్థినిలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ వివి సత్యనారాయణ ఇన్చార్జ ఉపాధ్యాయులు జోగేశ్వరరావు గ్రామ ఉప సర్పంచ్ బండారు రాజా విద్య కమిటీ చైర్మన్ రమణ పాఠశాల సిబ్బంది రామకృష్ణ సత్య రాజు కృష్ణమోహన్ పాండవులు మొదలైన వారు వీరికి అభినందనలు తెలియజేసినారు.

## ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న

### ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో యూనియన్ సభ్యునికి ఆర్థిక సహాయం



మచిలీపట్నం : ప్రజాపాలన మార్చి 3. ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అని మరోమారు నిరూపించారు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) మచిలీపట్నం యూనియన్ నాయకులు. గతంలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ ఇంజనీరింగ్ విద్యార్థికి తమ వంతు ఆర్థిక సహాయం అందించిన ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఈసారి యూనియన్లోని ఓ సభ్యుడికి తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించి తమలోని ఐకమత్యాన్ని మరో మారు చాటుకున్నారు. ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న యూనియన్ కుటుంబ సభ్యుడికి కుటుంబ సభ్యులతో పాటు మేము అండగా ఉంటామంటూ స్వచ్ఛందంగా ఆర్థిక సహాయాన్ని అందించి వారిలోని ఔన్నత్యాన్ని చాటుకున్నారు. ఇటీవల బెంగళూరులోని తన మేనల్లుడు వద్దకు వెళ్లి గుండెపోటుకు గురై శస్త్ర చికిత్స (స్టంట్స్) చేయించుకున్న ప్రకాష్ రావు (సూర్య రిపోర్టర్) సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి మచిలీపట్నం వచ్చిన విషయం అందరికీ తెలిసిందే. ఆ సమయంలో యూనియన్ తరపున ఎలాంటి సహాయం చేయలేకపోయామనే మనస్థాప%శీ%తో ఉన్న ఏపీయూడబ్ల్యూజే కుటుంబ సభ్యులందరూ ఒక నిర్ణయానికి వచ్చి ఎవరికి తోచిన విధంగా వారు స్వచ్ఛందంగా ఆర్థిక సహాయాన్ని అందించగా వచ్చిన మొత్తాన్ని నేడు (శుక్రవారం) మచిలీపట్నం వలంద పాలెం లోని ప్రకాష్ రావు ఇంటికి వెళ్లి ఆయన్ని పరామర్శించడంతో పాటు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. యూనియన్ తరపున సేకరించిన మొత్తాన్ని యూనియన్ నాయకులు, సీనియర్ పాత్రికేయులు చలమలశెట్టి రమేష్ బాబు ( సాక్షి జిల్లా క్రైమ్ రిపోర్టర్, యూనియన్ జిల్లా కన్వీనర్) పి జాషువా (యూనియన్ గౌరవ అధ్యక్షుడు, ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్), ప్రేమ్ నాథ్ (యూనియన్ గౌరవ సలహాదారుడు, వి న్యూస్ ఎడిటర్), చేతుల మీదుగా అందజేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రసాదుతో పాటు యూనియన్ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## జై భీమ్ భారత్ పార్టీ మన ఓటు మన పాలన




జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి:కాకినాడ జిల్లా స్థానిక జగ్గంపేట లో జై భీమ్ భారత పార్టీ జగ్గంపేట నియోజకవర్గం....ఎమ్మెల్యే అభ్యర్థి....సత్యానందం వల్లూరి..ఆధ్వర్యంలో జై భీమ్ భారత్ పార్టీ జడ శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు జై భీమ్ భారత్ పార్టీ మన ఓటు మన పాలన అనే నినాదంతో ప్రజల్లోకి జై భీమ్ భారత్ పార్టీ గ్రామ గ్రామాలకు యువతరానికి పార్టీ క్రియాశీలకంగా అండగా ఉంటుందని అనంతరం సత్యానందం మాట్లాడుతూ జడ శ్రవణ్ కుమార్ బడుగు బలహీన వర్గాల కోసం పేద ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేసిన మాజీ న్యాయమూర్తి జడ శ్రావణ్ కుమార్ పదవుల సైతం తున్న ప్రాయంతో విడిచిపెట్టి ప్రజల శ్రేయస్సు తన ధ్యేయంగా దళిత పీడిత వర్గాల కోసం వారికి రావలసిన ఆర్థిక నిధులు ప్రభుత్వం దోపిడీ చేస్తుందని అది ప్రత్యక్షంగా ఎదుర్కొనే దమ్ము ధైర్యం కలిగిన పార్టీ జై భీమ్ భారత్ పార్టీ అన్యాయం జరిగిన చోట శ్రవణ్ కుమార్ వాయిస్ వినిపిస్తుందని న్యాయవాదిగా ఎన్నో కేసులు వాదించిన ఘనత శ్రవణ్ కుమార్ చెందుతుంది అని అన్నారు ఈ కార్యక్రమంలో జై భీమ్ భారత పార్టీ జగ్గంపేట నియోజకవర్గం కొకన్వీనర్ మర్రి పృథ్వీరాజ్ వల్లపు సురేష్ దేవా బత్తుల దానియేలు సింహాచలం అరవింద్ చరణ్ నాని సోమేశ్వరరావు రాజేష్ ధర్మరాజు పండు తదితర నాయకులు పాల్గొన్నారు

## జగ్గంపేట స్వీట్ స్టాల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటి బాబు



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి : జగ్గంపేట గోకవరం రోడ్డు నెహ్రూ కాలనీ ఎదురుగా నూతన స్వీట్ స్టాల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు తో,వై యస్ ఆర్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు రామచంద్రాపురం పార్టీ పరిశీలకులు ఒమ్మి రఘురామ్, జగ్గంపేట ఎంపీటీసీ లు గొల్లపల్లి శ్రీను, ఎంపీటీసీ ఆకుల శ్రీధర్ ,చెరుకూరిజయరాజ్ మరియు వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నీలపల్లి అప్పారావు అంబేద్కర్ వాది,కిలపర్తి వీరబాబు తదితరులు

## కాకినాడ జిల్లా ఏడుగురి మృతి.. ఘటనలో ఇద్దరు ఉద్యోగులపై వేటు



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి ఫిబ్రవరి 9న జి. రాగంపేటలో ఏడుగురి ప్రాణాలను బలిగొన్న అంబటి సుబ్బన్న ఆయిల్ పరిశ్రమ ప్రమాదంపై కీలక శాఖల తుది నివేదిక సిద్ధమయ్యింది. కీలకమైన కర్మాగారాల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు లేకుండా కర్మాగారం నడుపుతున్నట్లు అధికారులు తేల్చారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కర్మాగారాల శాఖ ఉద్యోగితో పాటు మరోశాఖ ఉద్యోగిపైనా శాఖాపరమైన చర్యలకు ఈ నివేదికలో సిఫార్సు చేశారు.

## నవధాన్యాల సాగు నేలతల్లి బాగు



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి: జగ్గంపేట డివిజన్ మర్రి పాక గ్రామంలో పకృతి వ్యవసాయ విభాగం ఆర్ వై ఎస్ ఎస్ డి పి ఎం ఎలియాజర్ అదేశాల మేరకు మాస్టర్ ట్రైనర్ సంతోష్ మరియు గ్రామ సర్పంచ్ ఆనంద్ రావు గట్టి సతీష్ ఆధ్వర్యంలో ఈరోజు నవధాన్యాల సాగు పై అవగాహన ర్యాలీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎంటీ సంతోష్ మాట్లాడుతూ నవధాన్యాల సాగు చేయడం వల్ల భూములో అధిక సంఖ్యలో సూక్ష్మజీవులు, సూక్ష్మ పోషకాలు పెంపొందించడం వల్ల ఎటువంటి రసాయన ఎరువులు, పురుగుమందులు, అవసరం లేకుండా అధిక దిగుబడి తో పంటలు పండించడం జరుగుతుంది. నవధాన్యాల సాగుతో భూములు జీవవైవిధ్యం ఏర్పడి పంటలకు కావలసిన పోషకాలు లభ్యం అయ్యి భూములు తేమశాతం పెంచడమే కాకుండా అధిక దిగుబడును ఇవ్వడం జరుగుతుంది ఒకటన్ను పచ్చిరొట్ట ద్వారా సుమారు 30 టన్నుల సేంద్రియ కర్బనం, భూములో సహజ సేంద్రియ ఎరువుగా తయారవుతుంది అని చెప్పడం జరిగింది అలాగే గత సంవత్సరం జగ్గంపేట డివిజన్ లో 80 ఎకరాల ఒకే చోట నవధాన్యాల సాగు చేయడం ఈ గ్రామంలోనే జరిగిందని దానికి కారుకులైన గ్రామ సర్పంచ్ మరియు రైతులను అభినందించి ఈ సంవత్సరం కూడా అధిక మొత్తంలో భూమి ఉన్న ప్రతి ఒక్క రైతు చేత ఈ నవధాన్యాలు వేయించాలని చెప్పడం జరిగింది అనంతరం లిరసాయన ఎరువులు వద్దు- నవధాన్యాలు ముద్దులి అనే నినాదంతో ర్యాలీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గారైన ఆనంద్ రావు గట్టి సతీష్ పంచాయతీ సెక్రెటరీ ఏ.శేషగిరి రావు విహెచ్ఏ అనూష రైతులు,మరియు గ్రామ సచివాలయ సిబ్బంది మరియు గ్రామ వాలంటీర్లు డ్వాక్రా యానిమేటర్స్ మరియు పకృతి వ్యవసాయ సిబ్బంది ఎల్1, ఎల్2, ఎల్3, స్టాఫ్ అందరు పాల్గొనడం జరిగింది

# నేటితరం నాయకులకు రోల్ మోడల్ "బాలయోగి"వర్ధంతి కార్యక్రమంలో గన్ని కృష్ణ



రాజమహేంద్రవరం, ప్రజాపాలన ప్రతినిధి: కుగ్రామం నుండి దేశ రాజధాని ఢిల్లీ స్థాయి వరకు ఎదిగి లోక్‌సభ స్పీకరుగా పనిచేసిన జిఎంసి బాలయోగి నేటితరం నాయకులకు ఆదర్శమని గుడా మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. దివంగత లోక్‌సభ స్పీకర్ జిఎంసి బాలయోగి 21వర్ధంతి కార్యక్రమం గన్ని కృష్ణ ఆధ్వర్యంలో కంబాలచెరువు పార్కులో ఉన్న బాలయోగి కాంస్య విగ్రహం వద్ద జరిగింది. బాలయోగి విగ్రహానికి గన్ని కృష్ణ,మాజీ ఫ్లోర్ లీడర్ రాచపల్లి ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు తలారి ఉమాదేవి,రాయి అప్పన్న తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గన్ని కృష్ణ మాట్లాడుతూ బాలయోగి మరణించి 21ఏళ్ళు గడుస్తున్నా ఇప్పటికీ,ఎప్పటికీ ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా ఉంటారని అన్నారు.క్రింది స్థాయి నుండి ఉన్నతమైన స్థాయికి చేరుకున్నా ఏనాడు ఆయన హెచ్చించుకోలేదని, ఎంత ఎదిగినా కార్యకర్తలతో ఆయన మమేకమైన తీరు ఇప్పటికీ మరువలేమన్నారు. జిల్లాకు,రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు,అభివృద్ధి మరువలేమన్నారు. అలాంటి నేతల స్పూర్తితో తెదేపా శ్రేణులు మళ్ళీ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని గన్ని పిలువునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, టిఎన్టీయుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, పార్టీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, మాజీ కార్పొరేటర్లు మజ్జి పద్మ,తంగెళ్ళ బాబీ,కడలి రామకృష్ణ,యిన్నమూరి రాంబాబు,ద్వారా పార్వతి సుందరి,మాటూరి రంగారావు, సింహా నాగమణి,పార్టీ నాయకులు కంటిపూడి శ్రీనివాస్,నిమ్మలపూడి గోవింద్, షేక్ సుభాన్,తలారి భగవాన్,సంసాని ప్రసాద్,తలారి భాస్కర్,పితాని కుటుంబరావు, మరుకుర్తి రవియాదవ్,మళ్ళ వెంకట్రాజు,వారాది హనుమంత రావు,శీలం గోవింద్,శెట్టి జగదీష్, పల్లి సాయి,రొంపిచర్ల ఆంథోని, రొక్కం సత్యనారాయణ,సింగ్ సురేంద్రప్రసాద్,నర్సింగ్ శ్రీనివాస్, మజ్జి శ్రీనివాస్,కాదా ఈశ్వరరావు, ఆనెం చిన్న, గుణపర్తి శివ,సయ్యద్ అప్పరీ,సయ్యద్ ఫయాజ్,కవులూరి వెంకట్రావు,వానపల్లి శ్రీనివాసరావు, జామి సత్యనారాయణ, ఆర్. రాంబాబు, గాడి శ్రీను,ఉమామహేశ్వరరావు, రాయి అప్పన్న, విశ్వనాధరాజు,నల్లం ఆనంద్, మెహబూబ్ ఖాన్,వింజమూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఎఇఎల్సీ రీడింగ్ రూమ్ భవనాన్ని అక్రమంగా విక్రయించిన వారిపై క్రిమినల్ చర్యలు

### ఎఇఎల్సీ మోడరెటర్ బిషప్ రెవ. పరదేశీబాబు హెచ్చరిక



రాజమహేంద్రవరం: ప్రజాపాలన ప్రతినిధి :రాజమండ్రి కంబ సత్రం వీధిలో ఉన్న ఎఇఎల్సీ రీడింగ్ రూమ్ భవనాన్ని అక్రమంగా విక్రయించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఎఇఎల్సీ మోడరేటర్ బిషప్ రెవ.కె.ఎఫ్.పరదేశీబాబు హెచ్చరించారు.గుంటూరు నుంచి వచ్చిన బిషప్ పరదేశీబాబు గురువారం సాయంత్రం ఎఇఎల్సీ కోశాధికారి,ప్రోపర్టీ ఆఫీసర్ కె. ఆర్నాల్డ్ మోజెస్, కార్యదర్శి చిన్నం కిషోర్ బాబు, తూర్పు గోదావరి జిల్లా సినడ్ అధ్యక్షుడు అక్కాబత్తుల సామ్యూల్ రాజు, ఎఇఎల్సీ కౌన్సిల్ మెంబర్, తూర్పు గోదావరి జిల్లా సినడ్ ప్రోపర్టీస్ గోడి మోజెస్,హెూలీ ట్రినిటీ చైర్మన్ గుడాల జాన్సన్ తదితరులతో కలిసి రీడింగ్ రూమ్ భవనాన్ని పరిశీలించారు.అనంతరం బిషప్ పరదేశీబాబు మీడియాతో మాట్లాడుతూ ఈ భవనాన్ని తమకు తెలియకుండా రిటైర్డ్ పాస్టర్ చింతల ఏలియన్, మాజీ కోశాధికారి బుల్లబ్బాయి ఇటీవల ఒక సంస్థకు విక్రయించి రిజిస్ట్రేషన్ కూడా చేయించినట్లు తెలిసిందన్నారు.దీనిపై వెంటనే ఎఇఎల్సీ తరుపున తాము గుంటూరు ఎస్పీ, తూర్పు గోదావరి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు.ఈ ఆస్తిని విక్రయించే అధికారం ఏలియన్ కు లేదని స్పష్టం చేశారు.దీనిపై వారిమీద క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరినట్లు చెప్పారు. అక్రమంగా జరిగిన ఆ రిజిస్ట్రేషన్ చెల్లదని బిషప్ పరదేశీబాబు చెప్పారు.ఎఇఎల్సీ ఆస్తుల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.ఈ భవన విక్రయ రిజిస్ట్రేషన్ రద్దయ్యేవరకు ఉద్యమం చేస్తామని ఎఇఎల్సీ ప్రతినిధులు, సభ్యులు ముక్త కంఠంతో చెప్పారు.కార్యక్రమంలో సభ్యులు జంగం సుబ్బారావు,వాసా వర్జిల్,సమాధానం,కాటం రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జల్ జీవన్ మిషన్ క్రింద 2.12 కోట్లు నిధులతో కవులూరులో ఇంటింటికి నీటి కుళాయి ఏర్పాటుకు శ్రీకారం



జి:కొండూరు:మార్చి 03:(ప్రజా పాలన న్యూస్):జి. కొండూరు మండల పరిధిలోని కవులూరు గ్రామంలో శుక్రవారం 4వ రోజున గడప,గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ గడప,గడపకు వెళుతూ,నాడు ప్రభుత్వ హయాంలో అమలు జరిగిన సంక్షేమ పథకాలు గురించి -నేడు ప్రభుత్వ హాయంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు గురించి విపులంగా వివరిస్తూ,గడప,గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉత్సాహంగా ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ ముందుకు సాగుతున్నారు.ఈ సందర్భంగా జల జీవన్ మిషన్ క్రింద 2.12 కోట్ల రూపాయల నిధులు కవులూరు లో ఇంటింటికి నీటి కుళాయి ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించడం జరిగిందని,త్వరలోనే పనులు ప్రారంభం అవుతున్నట్లు శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్ తెలిపారు.ఇటు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు,అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే వసంత తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ,మండల వైకాపా అధ్యక్షులు నెల్లూరు లీలా శ్రీనివాసరావు,సచివాలయాల మండల కో ఆర్డినేటర్ కాజా బ్రహ్మయ్య, విజయవాడ రూరల్ వైకాపా అధ్యక్షులు బయ్యారపు రవికిషోర్,జి.కొండూరు వైస్ ఎంపీపీ ఈలప్రోలు తేజస్విని,సర్పంచి కొండా మరియమ్మ,ఉప సర్పంచ్ బొర్రా నరేంద్రబాబు,ఎంపీటీసీ డోల మధుబాబు, నాయకులు గొట్టుముక్కల ఓంకార్ బాబు, ఈలప్రోలు వెంకటేశ్వరరావు,గుణదల వెంకటేశ్వరరావు,సూదిరెడ్డి సురేష్ , చెరుకూరి సాంబశివరావు, బేతపూడి కృష్ణవేణి, సర్పంచ్ తమటం వెంకట్రామయ్య,పెండెం రాజేంద్రప్రసాద్,బాడిశ నాగరాజ కుమారి, పరికెల శ్రీనివాసరావు , దేశం సుధాకర్ రెడ్డి, కోపూరు రాంబాబు , నల్లమోతు చిన్నయ్య,నల్లమోతు బాబురావు, మందా నోవా,వేముల సీతారామయ్య,స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు, వైకాపా నాయకులు, ముస్లిం, మైనార్టీ సోదరులు, వైసీపీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గడప,గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వసంతకు ప్రజల విశేష ఆదరణ



జి.కొండూరు:మార్చి 03:(ప్రజా పాలన న్యూస్):జి.కొండూరు మండల పరిధిలోని కవులూరు గ్రామంలో గడప,గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం 4వ రోజు శుక్రవారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో వీధి -వీధిన గ్రామ ప్రజలు ఎమ్మెల్యే వసంత కు ప్రజా ఆదరణ లభించింది.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు లబ్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకుంటూ,వారు చెప్పిన సమస్యలు ఏమిటో?ఆ సమస్యలను వెంటనే పరిష్కరించడానికి ఆదేశాలను అధికారులకు జారీ చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా కవులూరు గ్రామానికి చెందిన గుణకంటి వెంకటేశ్వరరావు గురువారం రాత్రి గడప,గడప కార్యక్రమంలో తన నివాసానికి పొజిషన్ సర్టిఫికెట్ కావాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మొరపెట్టుకోనుగా,ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ వెంటనే రెవెన్యూ అధికారులకు పోయిన పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ ఆదేశాలు మేరకు,రెవెన్యూ అధికారులు వెంటనే పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయగా, శుక్రవారం గడప,గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ లబ్ధిదారుడైన గుణకంటి వెంకటేశ్వరరావుకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గుణకంటి వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కవులూరు వైకాపా కార్యకర్తలు,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## బచ్చుల అర్జునుడికి ఘన నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య



జగ్గయ్యపేట మార్చి 3 ప్రజా పాలన ప్రతినిధి:తెలు గు దేశం పార్టీ ఎమ్మెల్సీ, గన్నవరం నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇన్చార్జి బచ్చుల అర్జునుడుకి టిడిపి జా తీయ కోశాధికారి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇ న్చార్జి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఘన నివాళి అ ర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అర్జునుడి చి త్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో మేక వెంకటేశ్వర్లు, ఎలమంచిలి రా ఘవ, మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్లు కన్నెబోయిన రా మలక్ష్మి, నున్నా సాయి, షేక్ జాఫర్, సూర సతీష్, కోరి గోపి, సత్యం తదితరులు పాల్గొన్నారు

## ఏర్పేడు మండలంలోని కోబాక పంచాయతీలు హెల్త్ క్యాంపు



ఏర్పేడు మండలంలోని కోబాక పంచాయతీలో కోబాక గ్రామ సర్పంచ్ చెంగలరాయలు, ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగినది .ఈ హెల్త్ క్యాంపులో షుగర్ వ్యాధి టెస్టు టైఫాయిడ్ డెంగ్యూ మలేరియా, కు సంబంధించిన టెస్టు జ్వరము ,జలుబు దగ్గుకు సంబంధించిన టాబ్లెట్స్ ఈ క్యాంపులో ఇవ్వడం జరిగింది.కోబాక గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని చాలా భారీ స్థాయిలో సద్వినియోగంరు చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంగల్ రాయులు మాట్లాడుతూ మన గ్రామంలో ఏ సమస్య తలెత్తిన వెంటనే నా దృష్టికి తీసుకుని వచ్చిన యెడల స్పందించి పరిష్కార మార్గం చూపుతానని ప్రజలకు హామీ ఇచ్చారు ఈ క్యాంపు నిర్వహించడం వలన గ్రామ సర్పంచుకు ప్రజలు అభినందనలు తెలియజేశారు.

## వృక్షజాలము, జంతుజాలాన్ని రక్షించాలి: పెంటి శ్రీనివా సరావు




జగ్గయ్యపేట మార్చి3 ప్రజా పాలన ప్రతినిధి: ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకొని సామాజికవేత్త పెంటి శ్రీనివా సరావు ప్రపంచ వన్యప్రాణి దినో త్సవాన్ని అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవం, ప్రతి సంవత్సరం మార్చి3 న, నిర్వహించబడుతుందన్నారు రాష్ట్రస్థాయిలో ఇ ప్పటికే బయోడైవర్సిటీ వారి సౌజన్యంతో స్థానిక స్వ చ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో, జిల్లా ,మండల, గ్రా మ, స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ప్ర తి నెల జంతుజాలం వృక్షజాలంపై యాక్షన్ ప్లాన్ అ మలు చేయాలని, అందుకు స్థానిక ప్రజా ప్రతిని ధు లు, స్వచ్ఛంద సంస్థలు పౌర సమాజం. అందర్నీ భా గస్వామ్యం చేస్తూ వీటి పర్యవేక్షణకు ,సంరక్షణకు ప టిష్టమైన చర్యలను , వివిధ శాఖల మధ్య సమన్వ యంతో నిరంతరం అమలుకై నియోజకవర్గ స్థాయిలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు ,చేయాలని ఈ సందర్భంగా ప్ర భుత్వానికి తెలియపరిచారు.ప్రపంచ అడవి జంతు జాలం, వృక్షజాలం గురించి వేడుకలు జరుపుకునేం దుకు, అవగాహన పెంచడానికి మార్చి 3 ను ప్రపంచ వన్యప్రాణి దినోత్సవంగా పేర్కొనడం, అంతర్జాతీయ వాణిజ్యం జాతుల మనుగడకు ముప్పు కలిగించకుం డా చూసుకోవడంలోని ముఖ్య పాత్రనుగుర్తించిం ది. భారతదేశంలో వన్యప్రాణి సంరక్షణ కోసం 1972లో చట్టం చేశారన్నారు

# పూజా కార్యక్రమాలతో గోపీచంద్ కొత్త మూవీ షురూ!





ప్రముఖ కన్నడ దర్శకుడు ఎ హర్ష దర్శకత్వంలో గోపీచంద్ కొత్త చిత్రం ఈరోజు లాంఛనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. గోపీచంద్ 31వ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఇంకా పేరు పెట్టని ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ నెల నుంచి ప్రారంభం కానుంది.కేజీఎఫ్ ఫ్రాంచైజీ తో ఫేమ్ అయిన శాండల్‌వుడ్ మ్యూజిక్ కంపోజర్ రవి బస్రూర్ ప్రస్తుతం ప్రభాస్ సలార్ కి మ్యూజిక్ కంపోజ్ చేస్తున్నాడు. లేటెస్ట్ న్యూస్ ఏంటంటే, ఇప్పుడు ఈ టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్, ప్రభాస్ సలార్ చిత్రం తర్వాత హీరో గోపీచంద్ కోసం సంగీతం అందించడానికి సిద్ధంగా ఉన్నాడు. ఈ హై ఆక్టేన్ యాక్షన్ ఎంటర్టైనర్ కోసం ట్యూన్‌లను అందించడానికి రవి బస్రూర్ సంతకం చేయడం జరిగింది. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

## యుఎస్‌ఏ లో భారీ స్థాయిలో రిలీజ్ కానున్న 'దసరా' మూవీ




నాచురల్ స్టార్ నాని హీరోగా అందాల నటి కీర్తి సురేష్ హీరోయిన్ గా శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్ పై శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన దసరా మూవీ పాన్ ఇండియా రేంజ్ లో పలు భాషల్లో మార్చి 30న రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ గా రూపొందిన ఈ మూవీలో ధరణి పాత్రలో నాని కనిపించనుండగా వెన్నెల పాత్ర చేస్తున్నారు కీర్తి. ఇక ఇప్పటికే ఈ మూవీ నుండి రిలీజ్ అయిన సాంగ్స్, టీజర్ అందరినీ ఆకట్టుకొని మూవీ పై మంచి అంచనాలు ఏర్పరిచాయి. అయితే విషయం ఏమిటంటే, ఈ నెలాఖరులో రిలీజ్ కి సిద్ధం అవుతోన్న దసరా మూవీని యుఎస్‌ఏ లో భారీ స్థాయిలో అత్యధిక థియేటర్స్ లో విడుదల చేసేందుకు మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేసారు. ఈ మూవీని యుఎస్‌ఏ లో ప్రత్యంగిరా సినిమాస్ వారు రిలీజ్ చేయనున్నారు. అలానే ప్రీమియర్స్ ని మార్చి 29న గ్రాండ్ గా ప్లాన్ చేస్తున్నారు. నాని కెరీర్ లో దసరా మూవీ అక్కడ హైయెస్ట్ రిలీజ్ అవుతుందని, మరోవైపు ఇటీవల మంచి కంటెంట్ తో రిలీజ్ అయిన పలు సినిమాలు యుఎస్‌ఏ లో బాగా పెర్ఫర్మ్ చేయడంతో, ఆకట్టుకునే కథ, కథనాలతో రూపొందిన ఈ మూవీ కూడా తప్పకుండా యుఎస్ ఆడియన్స్ ని కూడా ఆకట్టుకుంటుందని యూనిట్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# కస్టడీ టీజర్ పై డైరెక్టర్ వెంకట్ ప్రభు లేటెస్ట్ పోస్ట్!




టాలీవుడ్ యంగ్ హీరో, అక్కినేని నాగ చైతన్య హీరోగా డైరెక్టర్ వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం కస్టడీ. ఈ చిత్రం పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో అరవింద్ స్వామి కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రం నుండి విడుదల అయిన ప్రచార చిత్రాలకి ప్రేక్షకుల నుండి, అభిమానుల నుండి సూపర్ రెస్పాన్స్ వస్తోంది. తాజాగా ఈ చిత్రం కి సంబంధించిన టీజర్ పై డైరెక్టర్ వెంకట్ ప్రభు పలు వ్యాఖ్యలు చేశారు. డియర్ చై ఫ్యాన్స్, మీ ఎగ్జైట్ మెంట్ ను పూర్తిగా అర్దం చేసుకున్నాం. కస్టడీ టీజర్ కి సంబంధించిన వర్క్ జరుగుతుంది. త్వరలో టీజర్ విడుదల డేట్ ను వెల్లడిస్తాం అని అన్నారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ పతాకం పై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం లో శరత్ కుమార్, ప్రియమణి, సంపత్ రాజ్, ప్రేమ జీ, అమరెన్, వెన్నెల కిషోర్, ప్రేమి విశ్వనాథ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మే 12, 2023 న వరల్డ్ వైడ్ గా థియేటర్ల లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# ఇద్దరు యంగ్ హీరోస్ లో మురుగదాస్ ఎవరితో?



ప్రస్తుతం కోలీవుడ్ లో ఉన్నటువంటి స్టార్ దర్శకుల్లో ఒకరైన స్టార్ దర్శకుడు ఏ ఆర్ మురుగదాస్ నెక్స్ట్ ప్రాజెక్ట్ ఆసక్తిగా మారింది. ఎప్పటి కప్పుడు పలు ఇంట్రెస్టింగ్ నేపథ్యాలతో సందేశాలతో వచ్చే మురుగ దాస్ సూపర్ స్టార్ రజినీకాంత్ తో చేసిన "దర్బార్" తర్వాత మళ్ళీ ఒక్క సినిమా కూడా అనౌన్స్ చేయలేదు. దీనితో తన లైనప్ పై మరింత ఆసక్తి అయితే నెలకొంది. కానీ గత కొన్ని రోజులు నుంచి యంగ్ హీరో శింబు తో అయితే ఓ సినిమా చేయనున్నట్టుగా టాక్ ఉంది. అలాగే మరో హీరో శివ కార్తికేయన్ తో కూడా మురుగదాస్ ఓ సినిమా ప్లాన్ చేస్తున్నట్టుగా బజ్ ఉంది. ఇప్పుడు ఈ ఇద్దరిలో ఎవరితో అయితే మురుగదాస్ మొదట సినిమా చేస్తారు అనేది ఆసక్తిగా మారింది. ప్రస్తుతం శింబు మరియు శివకార్తికేయన్ ఇద్దరు కూడా ఒకటి రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. దీనితో తాను ఏ హీరోతో ఫస్ట్ టేకప్ చేయనున్నారు అనేది కోలీవుడ్ వర్గాల్లో ఆసక్తిగా నిలిచింది.

# వైటెడ్ "కబ్జా" లో మరో స్టార్ హీరో.!




ప్రస్తుతం పాన్ ఇండియా సినిమా దగ్గర మంచి అంచనాలు నడుమ రిలీజ్ కి సిద్ధంగా ఉన్న చిత్రం "కబ్జా". కన్నడ ఇండస్ట్రీ నుంచి వస్తున్న మరో అవైటెడ్ సినిమా ఇది కాగా ఆల్రెడీ టీజర్ తో సాలిడ్ హైప్ ఈ సినిమాపై నెలకొంది. మరి ఇదిలా ఉండగా ఈ భారీ సినిమా అయితే మరికొన్ని రోజుల్లో రానుండగా మేకర్స్ అగ్రెసివ్ ప్రమోషన్స్ లో ఉన్నారు. ఇక ఈ సినిమాలో హీరోగా స్టార్ హీరో ఉపేంద్ర నటించగా కిచ్చా సుదీప్ కూడా మరో సాలిడ్ రోల్ లో అయితే తాను నటించాడు. మరి ఈరోజు అయితే మేకర్స్ మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ ని అందించారు. ఈ చిత్రంలో కన్నడ మరో స్టార్ హీరో శివరాజ్ కుమార్ కూడా ఉన్నట్టుగా అధికారిక పోస్టర్ తో అయితే అనౌన్స్ చేశారు. మరో ఈ సినిమాలో శివన్న అయితే గెస్ట్ రోల్ లో కనిపించనున్నారట. ఇక ఈ సినిమాకి ఆర్ చంద్రు దర్శకత్వం వహించగా రవి బస్రూర్ సంగీతం అందించారు. అలాగే వరల్డ్ వైడ్ గా ఈ మార్చ్ 17న రిలీజ్ కాబోతుంది.

# తన ఫరెవర్ మెమొరీ అంటూ షేర్ చేసిన చరణ్.!



ప్రస్తుతం మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా కియారా అద్వానీ హీరోయిన్ గా మావెరిక్ దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా కోసం తెలిసిందే. మరి ఈ సినిమా షూట్ నుంచి బ్రేక్ లో ఉన్న చరణ్ అయితే యూఎస్ లో భారీ తన లాస్ట్ భారీ హిట్ ఆర్ఆర్ఆర్ మాసివ్ సక్సెస్ లో ఎంజాయ్ చేస్తున్నాడు. మరి నిన్న యూఎస్ లో ఉన్న ఏస్ థియేటర్ లో సినిమా స్పెషల్ స్క్రీనింగ్ భారీ కెపాసిటీ తో ఫుల్ కాగా ఈ స్క్రీనింగ్ కి గాను చరణ్ కూడా హాజరయ్యాడు. అయితే ఇక్కడ అదిరే వెల్కమ్ ని అందుకున్న చరణ్ అయితే ఆ షోలో తన అనుభూతిని ఇప్పుడు పంచుకున్నాడు. ఏస్ హోటల్లో ఆర్ఆర్ఆర్ స్క్రీనింగ్ కి ఏమన్నా రెస్పాన్స్ ని ఇచ్చారు మీరు మా సినిమాకి అంతా నిలబడి చప్పట్లో గౌరవించడం అనేది నా ఫరెవర్ మెమొరీలలో ఒకటిగా ఈ దృశ్యం నిలిచిపోతుంది అని చరణ్ అయితే ఈ స్పెషల్ స్క్రీన్ పై ఓ బ్యూటిఫుల్ సెల్ఫీ మరియు తన దర్శకుడు జక్కన్న రాజమౌళి, అండ్ టీం కలిసి తీసుకున్న పిక్స్ తో షేర్ చేసాడు.

# సందీప్ రెడ్డి లైనప్ అదిరింది!




సందీప్ వంగా.. ఈ పేరు తెలియని వాళ్లు ఉండరంటే అతిశయోక్తి కాదు. 2017లో విజయ్ దేవరకొండ శాలినీ పాండేలు హీరోహీరోయిన్లుగా ఈయన తీసిన చిత్రం అర్జున్ రెడ్డి బ్లాక్ బస్టర్ హిట్టుగా నిలిచింది. ఇప్పటికీ ఆ సినిమాకు సెపరేట్ ఫ్యాన్స్ ఉన్నారు. తొలి సినిమాతోనే తన టాలెంట్ ను ప్రూవ్ చేసుకున్న వంగా సందీప్ రెడ్డి... సినిమా రచయితగా కూడా పని చేశారు. అర్జున్ రెడ్డి సూపర్ డూపర్ హిట్టవడంతో 2019లో ఈ చిత్రాన్ని హిందీలో రీమేక్ చేశారు. కబీర్ సింగ్ పేరుతో ఈ సినిమాని రీమేక్ చేయగా.. షాహిద్ కపూర్ కియారా అడ్వాణీ హీరోహీరోయిన్లుగా నటించి మెప్పించారు. తొలి సినిమాతోనే హిట్టు కొట్టిన సందీప్ వంగా టాలెంట్ గుర్తించిన టీ సిరీస్ సంస్థ ఆ తర్వాత ఆయన తీయబోయే ఐదు సినిమాలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఇవన్నీ తన సొంత ప్రొడక్షన్ హౌస్ వంగా పిక్చర్స్ తో కలిసి పని చేస్తున్నాయి. ప్రస్తుతం హిందీలో రణ్ బీర్ కపూర్ హీరోగా సందీప్ వంగా యానిమల్ అనే చిత్రం చేయబోతున్నారు. ఇందులో రష్మిక మందన్నా హీరోయిన్ గా నటిస్తోంది. అయితే ఈ చిత్రాన్ని టీ సిరీస్ పతాకంపై ప్రొడ్యూసర్ భూషణ్ కుమార్ సినిమాను నిర్మిస్తున్నారు. అలాగే యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ తో కూడా సందీప్ వంగా స్పిరిట్ అనే సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి కూడా టీ సిరీస్ పతాకంపై నిర్మాత భూషణ్ కుమార్ సినిమాను నిర్మిస్తున్నారు. అయితే ఇదొక కాప్ డ్రామా చిత్రమని.. ఇది చాలా యూనిక్ సినిమా అని ప్రొడ్యూసర్ తెలిపారు. అలాగే అల్లు అర్జున్ తో కలిసి సందీప్ వంగా ఏఏ23 అనే సినిమాను చేయబోతున్నారు. అల్లు అర్జున్ కు ఇది 23వ సినిమా కాబట్టి వర్కింగ్ టైటిల్ ను ఏఏ23గా ఖరారు చేశారు. దీనికి కూడా టీ సిరీస్ భద్రకాళి పిక్చర్స్ పై హిందీ నిర్మాత భూషణ్ కుమార్ ప్రణవ్ రెడ్డి వంగా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మరోసారి అర్జున్ రెడ్డి కాంబో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా.. విజయ్ దేవరకొండతో కలిసి ఈ చిత్రం చేయబోతున్నారు.

# హరిహర వీరమల్లు" పై ఇంట్రెస్టింగ్ బజ్.!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నిధి అగర్వాల్ హీరోయిన్ గా విలక్షణ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా "హరిహర వీరమల్లు" కోసం తెలిసిందే. మరి ఈ సినిమా షూటింగ్ ఇంకా చాలా బాలన్స్ ఉండగా ఆ మధ్య అయితే ఈ సినిమాపై ఓ క్రేజీ రూమర్ బయటకి వచ్చింది. మరి ఈ సినిమా అయితే మేకర్స్ రెండు భాగాలుగా ప్లాన్ చేస్తున్నట్టుగా టాక్ వచ్చింది. మరి దీనిపై అయితే ఓ క్లారిటీ తెలుస్తుంది. సినిమాకి పార్ట్ 2 కి పాజిబులిటీ ఉంది కానీ డెఫినెట్ గా పార్ట్ 2 ని తెరకెక్కించే ఆలోచన ఇప్పట్లో లేదట. మొదటి భాగం హిట్ అయ్యి తర్వాత పవన్ కూడా ఓకే అంటే తప్ప పార్ట్ అయితే స్టార్ట్ కాదని వినికిడి. దీనితో దాదాపు అయితే హరిహర వీరమల్లు ఒక్క పార్ట్ గానే వస్తుంది అని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి ఎం ఎం కీరవాణి అయితే సంగీతం అందిస్తుండగా మెగాసూర్య ప్రొడక్షన్స్ వారు పవన్ కెరీర్ లోనే భారీ బడ్జెట్ తో నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com